


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 05-09-2020 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 310 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చేలా ఆస్పత్రులు వ్యవహరిస్తే

# కఠిన చర్యలు

- ప్రతి ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో హెల్ప్ డెస్కులు ఉండాలి
- ఎక్కడ తప్పులు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలి
- రిఫరల్ విధానం చాలా సమర్థవంతంగా ఉండాలి
- కోవిడ్ పేషంట్లకు వేల బెడ్లు అందుబాటులో..

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**



అమరావతి : ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చేలా ఆస్పత్రులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు. రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోవిడ్ ఆస్పత్రుల్లో 37,441 బెడ్లు ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. సాధారణ బెడ్లు 2,462, ఆక్సిజన్ సపోర్టుతో ఉన్న బెడ్లు 11,177, ఐసీయూ బెడ్లు 2,651 ఇంకా ఖాళీగా అందుబాటులో ఉన్నాయని సీఎంకు వివరించారు. కొన్ని పత్రికలు కావాలనే విషపూరిత రాతలు రాస్తున్నాయని సమీక్షలో చర్చించారు. కోవిడ్ ఆస్పత్రుల్లో తాత్కాలిక నియామకాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

మొత్తం 30,887 పోస్టులకు గానూ 21,673 పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయగా.. రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో 9,971 పోస్టులకుగాను 4,676 పోస్టుల నియామకం పూర్తయిందని పేర్కొన్నారు. ఇందులో 5,295 పోస్టుల భర్తీకి ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. మరో 10 రోజుల్లో వీటి భర్తీ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. కోవిడ్ కోసం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిరోజూ రూ. 10.18 కోట్లు చేస్తోందని వెల్లడించారు. వైరస్ నిర్ధారణ పరీక్షల కోసం రూ. 4.3 కోట్లు, ఆహారం కోసం రూ.1.31 కోట్లు, మందులు కోసం రూ. 4.57 కోట్లు ఖర్చవుతోందని తెలిపారు. కాగా, తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షా కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శి జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఆరోగ్య శ్రీ సేవల్లో వారే కీలకం**

ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చేలా

తరువాయి 2లో..

# ఖాకీ దుస్తులు చూసి గర్వపడాలి

### ఒత్తిడి ఇలా తగ్గించుకోండి యోగా, ప్రాణాయామం చేయండి..

### యువ ఐపీఎస్‌లకు మోదీ సందేశం



న్యూఢిల్లీ : ఖాకీ దుస్తులను చూసి గర్వపడాలి తప్ప అహంభావం ఉండకూడదని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కట్టడిలో పోలీసులు ముందుండి పోరాడుతున్నారని కితాబిచ్చారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో నిర్వహించిన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మాట్లాడారు. ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి స్ఫూర్తిదాయక సందేశమిచ్చారు. యోగా, ప్రాణాయామం ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని అన్నారు. మనసులోనూ యోగా చేయడం చాలా మంచి పద్ధతని చెప్పారు.

" కరోనా సంకట పరిస్థితుల్లో పోలీసుల సేవలు ప్రశంసనీయం, కరోనా కట్టడిలో పోలీసులే ముందుండి పోరాడుతున్నారు. కరోనా వేళ మానవతా దృక్పథంతో సేవలందిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో ఖాకీల మానవీయ కోణం ప్రజలకు తెలిసింది. ఈ కష్టకాలంలో పోలీసుల పాత్రను చరిత్రలో లిఖించారు. ఐపీఎస్ ప్రొబేషనర్లను గతంలో ఇంటికి ఆహ్వానించే వాడిని. కొవిడ్ కారణంగా ముఖాముఖి కలుసుకోలేకపోతున్నా. త్వరలోనే మీతో సమావేశమవుతా" అని మోదీ అన్నారు.

ప్రజా సేవలో ఉండే అధికారులు ఆరోగ్యంగా ఉండాలని ప్రధాని మోదీ తెలిపారు. పనిభారం, ఒత్తిడి ప్రభావం ఆరోగ్యంపై పడకుండా చిట్కాలు పాటించాలన్నారు. పనిచేసే చోట ఉపాధ్యాయులు,నిపుణులతో నెలకోసారైనా భేటీ కావాలన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, సహాయక మంత్రి కిషన్‌రెడ్డి, జితేంద్రసింగ్, వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఏడాది 131 మంది ఐపీఎస్ అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 121 మంది 2018 బ్యాచ్‌కు చెందినవారు కాగా.. మరో 10 మంది 2017 బ్యాచ్‌కు చెందినవారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 28 మంది మహిళా ప్రొబేషనర్లు ఉన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 11 మందిని తెలంగాణకు, ఐదుగురిని ఏపీకి కేటాయించారు. పాసింగ్ ఔట్ పరేడ్‌కు తమిళనాడు కేడర్‌కు చెందిన కిరణ్ శృతి నాయకత్వం వహించారు.

### సమగ్ర ప్రపంచ భద్రతకు

# భారత్ కట్టుబడి ఉంది

**రాజ్‌నాథ్ సింగ్**




మాస్కో : షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) వేదికగా భారత దేశం వైఖరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విస్పష్టంగా ప్రకటించారు. సమగ్ర,పారదర్శక ప్రపంచ భద్రతకు భారత దేశం కట్టుబడి ఉందన్నారు. షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ), కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్ (సీఎస్‌టీఓ), కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ (సీఐఎస్) సభ్య దేశాల రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం మాట్లాడుతూ, పారదర్శక, అన్ని దేశాల భాగస్వామ్యంతోకూడిన సమగ్ర, అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఉండే ప్రపంచ భద్రతా వ్యవస్థ వృద్ధి చెందడానికి భారత దేశం కట్టుబడి ఉందని చెప్పారు.

ఎస్‌సీఓ రీజియన్‌లో శాంతిభద్రతల కోసం అంతర్జాతీయ నియమ, నిబంధనలను గౌరవించే విశ్వసనీయ, సహకారాత్మక, విరోధం లేనటువంటి వాతావరణం అవసరమని నొక్కి వక్కాణించారు. ఎస్‌సీఓ సభ్య దేశాల్లో ప్రపంచ జనాభాలో 40 శాతం పైగా ఉందన్నారు. 'ఈ ప్రాంతంలో అందరి భద్రత, వృద్ధి మన లక్ష్యం కావాలి' అని ప్రధాన

తరువాయి 2లో..

# యథాతథంగా నీట్, జేఈఈ పరీక్షలు



న్యూఢిల్లీ : జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలన్న రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలని సుప్రీం కోర్టులో 6 రాష్ట్రాలు రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశాయి. ఆరు బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో నీట్, జేఈఈ పరీక్షలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఆగస్టు 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని రివ్యూ పిటిషన్‌లో పేర్కొన్నారు. కొవిడ్ వ్యాప్తి దృష్ట్యా నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలని కోర్టును కోరారు. కానీ ఈ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దేశ వ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం విదితమే.

పశ్చిమ బెంగాల్, జారండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మహారాష్ట్రకు చెందిన మంత్రులు సంయుక్తంగా ఆగస్టు 28న సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఒకవైపు కరోనా మహమ్మారి, మరోవైపు భారీ వర్షాలు, వరదల వల్ల తమ తమ రాష్ట్రాల్లో పరీక్షలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయిని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జేఈఈ, నీట్ పరీక్షలను వాయిదా వేయాలని ఆరు రాష్ట్రాల ముంత్రులు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలను రద్దు చేయాలని 11 రాష్ట్రాలకు చెందిన 11 మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఆగస్టు 17న సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ తీర్పును పునఃసమీక్షించాలని ఆరు బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు కోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశాయి. ఆ పిటిషన్‌ను కూడా కోర్టు శుక్రవారం కొట్టేసింది.

# ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్‌కు రూ.20 కోట్ల రుణం

విజయవాడ: కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ ప్రక్రియలో భాగంగా ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్‌కు రూ.20 కోట్ల రూపాయల మేర రుణాన్ని ఏపీఎండీసీ నుంచి తీసుకునేందుకు అనుమతి లభించింది. రెండూ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలే అయినందున బ్యాంకు గ్యారెంటీ లేకుండా రుణాన్ని తీసుకునేందుకు ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ అనుమతి పొందింది. ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్‌గా కడప ఉక్కు కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది. ఏడాదికి 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో వైఎస్సార్ కడప జిల్లా సున్నపురాళ్లపల్లి, పెదనందలూరు గ్రామాల్లో 3,591.65 ఎకరాల్లో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది డిసెంబర్ 23న శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే సివిల్ పనులు శరవేగంగా జరుగుతుండగా, వచ్చే జనవరి నుంచి ప్రధాన ప్లాంటు పనులు ప్రారంభమయ్యే విధంగాఏపీహెచ్ఎస్ఎల్ ప్రణాళికలు సిద్ధం.

### దశలవారీ మద్య నిషేధంలో భాగంగానే

# ధరలను క్రమబద్ధీకరించాం

**డిప్యూటీ సీఎం నారాయణ స్వామి**



విజయవాడ : దశలవారీ మద్య నిషేధంలో భాగంగానే ధరలను క్రమబద్ధీకరించామని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. కొందరు పేదలు శానిటైజర్లు తాగి చనిపోవడం చాలా బాధాకరమని, అందుకే చీప్ లిక్కర్‌పై ధరలను తగ్గించామని పేర్కొన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 43 వేల బెల్ట్ షాపులు తొలగించామని, ఇప్పటికే 33 శాతం మద్యం షాపులు, బార్లను తగ్గించామని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దశల వారిగా మద్య నిషేధానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే చంద్రబాబు, టీడీపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ కేంద్రాల్లో అక్రమ మద్యం అమ్ముతూ పట్టుబడిన విషయాన్ని ఉపముఖ్యమంత్రి గుర్తుచేశారు. దాదాపు 80 శాతం మంది టీడీపీ నేతలు అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న సంగతి వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్టీఆర్ హయాంలో మద్యపాన నిషేధానికి తూట్లు పొడిచినట్లే ఇప్పుడు కూడా చంద్రబాబు అలాగే వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారిందన్నారు. కానీ, సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని విధంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ని ఏర్పాటు చేశారని నారాయణ స్వామి వెల్లడించారు. దీని ద్వారా మూడు నెలల్లో 36 వేల కేసులుపెట్టి 46 వేల మందిని అరెస్ట్ చేశారని పేర్కొన్నారు.

# ఎల్ఏసీ వెంట స్వల్ప ఉద్రిక్తత

**ఆర్మీ చీఫ్ జనరల్ నరవాణె**

న్యూఢిల్లీ : చైనాతో సరిహద్దు సమస్య తలెత్తిన నేపథ్యంలో.. ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణె లేహ్‌లో పర్యటిస్తున్నారు. రెండు రోజులు పర్యటనలో ఆయన పలు ప్రాంతాలను విజిట్ చేశారు. ఇవాళ మీడియాతో మాట్లాడుతూ.. లేహ్ చేరుకున్న తర్వాత పలు ప్రాంతాలను విజిట్ చేశానని, ఆఫీసర్లు, జేసీవోలతో మాట్లాడానని, దళాలు ఎంత వరకు సంసిద్ధంగా ఉన్నాయో తెలుసుకున్నట్లు నరవాణె చెప్పారు. జవాన్లలో స్ఫూర్తి అత్యధిక స్థాయిలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎటువంటి సవాళ్లను అయినా ఎదుర్కొనేందుకు వారంతా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

వాస్తవాధీన వెంటు పరిస్థితి కొంత ఉద్రిక్తంగానే ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ నరవాణె తెలిపారు. ఈ పరిస్థితిని అంచనా వేసి దానికి తగినట్లుగా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని, దానిలో భాగంగానే ఎల్ఏసీ వెంట బలగాలను పెంచినట్లు చెప్పారు. మన భద్రత, ఐక్యత సురక్షితంగా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. గత రెండు మూడు

తరువాయి 2లో..



# కరోనా అవునా...కాదా...ఆలోచన వద్దు



శ్రీకాకుళం : కరోనా లక్షణాలు ఉన్నప్పటికి కరోనా అవునా ? కాదా ? అనే ఆలోచన వద్దని జిల్లా కలెక్టర్ జె నివాస్ ప్రజలను కోరారు. కరోనా లక్షణాలు కనిపించగానే చికిత్సకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా శుక్ర వారం ప్రజలను ఉద్దేశించి ఒక సందేశాన్ని విడుదల చేస్తూ జిల్లా కోవిడ్ ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ప్రస్తుతం అత్యంత కీలక సమయంలో ఉన్నామని, రానున్న నెలన్నర రోజులు జిల్లాకు మరింత కీలకమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో రోజుకు 8 వందల నుండి వెయ్యి కేసులు వరకు నమోదు అవుతున్నాయని ఆయన చెప్పారు. ప్రజలందరూ పూర్తిగా అప్రమత్తంగా ఉండి వైరస్ నివారణకు సహకరించాలని కోరారు. శ్రీకాకుళం పట్టణంలో రోజుకు కనీసం రెండు వందల కేసులు నమోదు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఇతర పట్టణాల్లో కూడా పరీక్షలు అధికంగా చేయుటకు నిర్ణయించామని చెప్పారు. జ్వరం, ఆయాసం వంటి ప్రాథమిక లక్షణాలు ఉన్న వాళ్ళు కరోనా కాదు అనే ధీమాతో ఉంటున్నారని, పరిస్థితులను వాలంటీరుకు వివరింగా తెలియజేసి సరైన చికిత్సను సరైన సమయంలో పొందాలని ఆయన కోరారు. 94 శాతం కంటే తక్కువ ఆక్సిజన్, ఆయాసం, వరుసగా మూడు రోజుల పాటు జ్వరం ఉన్న వారు చికిత్స పొందుటకు ఆలస్యం చేయరాదని ఆయన సూచించారు. సకాలంలో ఆస్పత్రిలో చేరడం వలన ఖచ్చితంగా ప్రాణాలు కాపాడగలమని వైద్యులు తెలియజేస్తున్నారని కలెక్టర్ వివరించారు. చిన్న పాటి లక్షణాలు ఉన్న వారికి చికిత్సను అందించుటకు కోవిడ్ కేర్ కేంద్రాల్లో 5 వేల పడకలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. కోవిడ్ ఆసుపత్రుల్లో మంచి వైద్యం అందిస్తున్నామని, నిపుణులైన వైద్యులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మంచి మందులతోపాటు ప్లాస్మా థెరాఫీని కూడా అందిస్తున్నామని ఆయన స్పష్టం చేసారు. జిల్లాలో 73 మందికి ప్లాస్మా థెరాఫీ అందించామని, వాళ్ళందరి ఆరోగ్యం మెరుగుపడిందని ఆయన చెప్పారు. జిల్లాలో కరోనా వ్యాప్తి నిరోధానికి మొదటి నుండి అనేక చర్యలు చేపట్టిన సంగతి ఆయన గుర్తు చేశారు. కంటైన్మెంటు జోన్లను పక్కాగా నిర్వహించాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. శ్రీకాకుళం పట్టణంలో 66 కంటైన్మెంటు జోన్లు ఉన్నాయని ఆయన తెలియజేస్తూ కంటైన్మెంటు జోన్లలో మొబైల్ వ్యాన్ల ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు చెప్పారు. కంటైన్మెంట్ జోన్లలో పరీక్షలు నిర్వహించుటకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఇంటివద్దకే పరిమితం కావాలని ఆయన సూచించారు. అత్యవసరమైతే మినహా బయటకు రావద్దని ఆయన పిలుపునిచ్చారు. ఇంట్లో ఉన్న పెద్దలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరుతూ వారికి ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించాలని, వారితో మాట్లాడినప్పుడు మాస్కు విధిగా ఉపయోగించాలని సూచించారు. పెద్దలు క్షేమంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకోవాలని ఆయన అన్నారు. ప్రజల జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఇతర రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచితంగా ఫేస్ షీల్డులు పంపిణీ చేయుటకు చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. ఫేష్ షీల్డ్ ఉపయోగించడం వలన 80 శాతం వరకు కరోనా వైరస్ వ్యాప్తి నుండి సురక్షితంగా ఉండవచ్చని సర్వేలు సూచిస్తున్నట్లు కలెక్టర్ నివాస్ చెప్పారు. వ్యాపార సంస్థల నిర్వాహకులు, ఆటో రిక్షావారు కరోనా వైరస్ కు హై రిస్కు కలిగి ఉంటారని అన్నారు. తమ వద్దకు వచ్చే కస్టమర్లు విధిగా మాస్కు ధరించేటట్లు చూడాలని ఆయన సూచించారు. జిల్లా లో వైరస్ వ్యాప్తి నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరుతూ కరోనా వైరస్ నిర్మూలనకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మన ప్రియతమ నాయకులు వైయస్.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సక్రమంగా అందుతున్నాయా లేదా అను కార్యక్రమంను జూలై 23 నుండి కొన్ని కారణాల వలన ఈ కార్యక్రమమును నిలిపి వేయడం జరిగినది. దయచేసి ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని కోరుకుంటూ మళ్లీ శుక్రవారం నుండి మీ ముందుకు వస్తూ మీ యొక్క సమస్యలను అడిగి తెలుసుకుంటున్న 6వరోజైన కల్లుపాకులు వద్ద వున్నా ప్రజలకు గడపగడపకు వెళ్లి అడిగి తెలుసుకుంటున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ35వ వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్థి అలుపన కనకరెడ్డి. ఈకార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు ప్రధాన కార్యదర్శి, ఏ.ఆదివిష్ణురెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్, ఎస్.కె యాసీన్, దక్షిణ నియోజకవర్గం సేవాదళ్ ప్రెసిడెంట్, ఏ.సుబ్బిరెడ్డి, వార్డు సీనియర్ నాయకులు, చల్లా రావు, పెద్ద మూర్తి,జి. రమణ, బప్పి నగేష్, కొత్తిమీర రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్ గార్డెన్ పరిధిలో వున్న కొంతమంది డ్వాక్రా మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా రుణమాఫీ కొరకు వివరిస్తూ మహిళా సంఘాలకు అటెండెన్స్ కొరకు బయోమెట్రిక్ ద్వారా మహిళా సంఘ సభ్యులతో తంబు వేయిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ35వ వార్డు అధ్యక్షులు కార్పొరేటర్ అభ్యర్థి అలుపన కనకరెడ్డి ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి, ఏ.ఆదివిష్ణురెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్, ఎస్కే, యాసీన్, విజయ్, కృష్ణ. వార్డు, ఆర్పీలు, పైడిరాజు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా విస్తృత వ్యాక్సినేషన్ ఇప్పట్లో లేనట్టే!

### డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు

జెనీవా: ప్రపంచ వ్యాప్తంగా కరోనా కల్లోలం పెరుగుతుండటంతో అందరి చూపూ వ్యాక్సిన్‌పైనే ఉంది. ప్రజాజీవనాన్ని, ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసిన ఈ మహమ్మారిని అంతం చేసేందుకు ప్రపంచ దిగ్గజ ఔషధ తయారీ సంస్థలు వ్యాక్సిన్ తయారీలో తలమునకలై ఉన్నాయి. ఇంకా మూడో దశ ట్రయల్స్ జరుగుతుండగానే వ్యాక్సిన్‌ను ఇదిగో తెచ్చేస్తున్నామంటూ రష్యా, అమెరికాలు ప్రకటనలు చేసిన తరుణంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కీలక వ్యాఖ్యలు చేసింది. కొవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొనేలా విస్తృత వ్యాక్సినేషన్‌ను 2021 మధ్యకాలం వరకు చూస్తామని తాము భావించడంలేదని ఆ సంస్థ అధికార ప్రతినిధి మార్గరెట్ హ్యారిస్ అన్నారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడిన ఆమె.. ఆయా ఔషధ సంస్థలు అభివృద్ధి చేస్తున్న వ్యాక్సిన్లు కరోనా నుంచి కాపాడేందుకు ఏమేర ప్రభావం చూపుతాయో, ఎంతవరకు భద్రతను కల్పిస్తాయో తదితర అంశాలను సునిశితంగా పరిశీలించాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వ్యాక్సిన్ల మూడో దశ ప్రయోగాలకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఎందుకంటే నిజంగానే ఆ వ్యాక్సిన్లు కరోనా నుంచి రక్షణ కల్పిస్తాయా? ఏమేరకు సురక్షితం? తదితర అంశాలను జాగ్రత్తగా చూడాల్సి ఉంటుందని చెప్పారు.

ఓవైపు కరోనా వైరస్‌కు వ్యాక్సిన్‌ను నవంబర్ 1నాటికి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్రాల గవర్నర్లకు అమెరికా రోగ నియంత్రణ సంస్థ (సీడీసీ) లేఖ రాయగా.. తాజాగా అక్టోబర్ చివరి నాటికి వ్యాక్సిన్ కష్టమే నంటూ అగ్రరాజ్యంలోని అంటువ్యాధుల ప్రముఖ నిపుణుడు ఆంటోనీ ఫౌచీ అభిప్రాయపడ్డారు.

వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన ఏడాది లోపు ప్రపంచం సాధారణ స్థితికి చేరుకోగలగదని ఆయన అంచనా వేశారు. మరోవైపు, టీకాలపై మూడో దశ క్లినికల్ పరీక్షలు ఇంకా పూర్తికాకుండానే 'నవంబరు 1' గడువును నిర్దేశిస్తూ సీడీసీ సూచనలు జారీ చేయడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

మొదటి పేజీ తరువాయి

## ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చేలా ఆస్పత్రులు వ్యవహరిస్తే కఠినచర్యలు

ఆస్పత్రులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. సేవలు అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రతి ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో హెల్ప్ డెస్క్‌లను పెట్టాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య మిత్రలతో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎక్కడ తప్పులు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపానల్ అయిన ప్రతి ఆస్పత్రిలోనూ హెల్ప్ డెస్క్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని, రిఫరల్ విధానం చాలా సమర్థవంతంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. కోవిడ్ ఆస్పత్రుపై ఎలాంటి సమీక్ష చేస్తున్నామో అన్ని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు, ఎంపానల్డ్ ఆస్పత్రులపై సమీక్ష చేయాలని అన్నారు.

రోగులకు వైద్యం సరిగ్గా అందలేదంటే వారిని సరైన ఆస్పత్రికి పంపించే బాధ్యత ఆరోగ్యమిత్రలదేనని సీఎం స్పష్టం చేశారు. పతిరోజూ అధికారులు కాల్ సెంటర్లకు మాక్ కాల్ చేసి పనితీరును పరిశీలించాలని చెప్పారు. ప్రతి మాక్ కాల్‌పై వస్తున్న రెస్పాన్స్‌ను కూడా రికార్డు చేయాలని చెప్పారు. ఆహారం, శానిటేషన్, డాక్టర్లు, మౌలిక సదుపాయాలు.. ఈనాలుగు పారామీటర్స్ మీద ప్రశ్నలు వేసి.. రోగులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. వీటిద్వారా ఆస్పత్రులకు రేటింగ్ ఇవ్వాలని సీఎం చెప్పారు. కొత్త వైద్య కళాశాలల నిర్మాణం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా తీసుకొస్తున్న కాలేజీలు ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## సమగ్ర ప్రపంచ భద్రతకు భారత్ కట్టుబడి ఉంది

మంత్రి నరేంద్ర మోదీ గతంలో వేరే సందర్భంలో చెప్పారని గుర్తు చేశారు.

ఉగ్రవాదం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్జాతీయ నేరాలు వంటివాటిని ఎదుర్కొనేందుకు సంస్థాగత సామర్థ్యం అవసరమని చెప్పారు. అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని భారత దేశం నిర్ద్వంద్వంగా ఖండిస్తోందని, ఈ విషయం అందరికీ తెలుసునని చెప్పారు. ఎస్‌సీఓ రీజనల్ యాంటీ టెర్రరిజం స్ట్రక్చర్ కృషి చాలా విలువైనదని చెప్పారు. రాడికలిజం, అతివాదం వ్యాపించకుండా చేసిన కృషిని ప్రశంసించారు.

## ఎల్ఏసీ వెంట స్వల్ప ఉద్రిక్తత

నెలల నుంచి ఎల్ఏసీ వెంట పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నట్లు చెప్పారు. కానీ సైనిక, దౌత్యపరమైన స్థాయిలో చైనాతో నిరంతరం చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా చర్చలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు.

చర్చల ద్వారా సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ తెలిపారు. చైనాతో ఉన్న విభేదాలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఎల్ఏసీ వద్ద ఆక్రమణలు జరగనివ్వమని, మన సరిహద్దుల్ని మనం రక్షించుకుంటామన్నారు.

## దేవినేని ఉమాపై కొడాలి నాని ఫైర్

### దేవినేని ఉమా నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది

### రైతుల విద్యుత్ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది



తాడేపల్లి: రైతులకు శాశ్వతంగా ఉచిత విద్యుత్ అందేలా చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని మంత్రి కొడాలి నాని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రైతులు వాడుకున్న విద్యుత్‌కు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తుందని శుక్రవారం పునరుద్ఘాటించారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులను కరెంట్ విషయంలో ఇబ్బందులకు గురిచేసిందని.. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపించిన దుర్మార్గుడు చంద్ర బాబు అని మండిపడ్డారు. ఆయన హయాం లో రైతులను మానసికంగా హింసించి ఇబ్బందులు పెట్టారని పేర్కొన్నారు. అయితే సీఎం జగన్ అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమంపై దృష్టి సారించారని తెలిపారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ.. కుల, మత, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఉచితంగా పగటిపూట 9 గంటల కరెంట్ ఇస్తూ.. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని తెలిపారు.

**దేవినేని ఉమా తండ్రి సోడాలు కొట్టేవాడు**

తనపై విమర్శలకు దిగిన టీడీపీ నేత దేవినేని ఉమాకు కొడాలి నాని ఈ సందర్భంగా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ''దేవినేని ఉమా చరిత్ర ప్రజలందరికీ తెలుసు. ఆయన ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలి. నువ్వేమైనా మైసూర్ మహారాజువా..?. దేవినేని ఉమా తండ్రి సోడాలు కొట్టేవాడు.. వాటిని ఈయన కడిగేవాడు. చంద్రబాబే పెద్ద భిక్షగాడు.. ఆయన నాకు రాజకీయ భిక్ష పెట్టడమేంటి? నాకు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్‌టీఆర్'' అంటూ ఫైర్ అయ్యారు. సీఎం జగన్ తనకు రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, ఆయన వల్లే తాను మంత్రిగా ఉన్నానని వ్యాఖ్యానించారు.

''పథకాలను అటకెక్కించిన ఘనత చంద్రబాబుదే. డబ్బులు కట్టలేదని కరెంటు మీటర్లు పీకించిన ఘనత ఆయనదే. ఆయన ప్రభుత్వం పెట్టిన బకాయిలను అధికారంలోకి రాగానే చెల్లించాం.

అలాంటి వ్యక్తి చెబుతున్న అబద్ధాలకు ఎల్లోమీడియా వంత పాడు తోంది''అని చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో రికార్డు స్థాయిలో కరోనా పరీక్షలు నిర్వహి ఔస్తున్నామని పేర్కొన్నారు.

## ప్రియుడిపై యాసిడ్ పోసిన ప్రియురాలు



కర్నూలు: తనను కాదని మరొక అమ్మాయిని వివాహం చేసుకున్నాడన్న కోపంతో ప్రియుడిపై యాసిడ్ దాడి చేసిందో యువతి. ఈ సంఘటన జిల్లాలోని నంద్యాల మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన నాగేంద్ర, సుప్రియ మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరని, ప్రేమ పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోరని నాగేంద్ర ఆమెతో ప్రేమకు బ్రేకప్ చెప్పాడు. ఆ తర్వాత వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో ప్రియుడి వివాహాన్ని జీర్ణించుకోలేకపోయింది సుప్రియ. అతడిపై యాసిడ్ దాడికి పాల్పడింది. యాసిడ్ దాడిలో నాగేంద్ర ముఖం, చెయ్యి బాగా కాలిపోవటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**అందుకే యాసిడ్ పోశా: సుప్రియ**

తనను మోసం చేసింది కాక తిరిగి తనతో ప్రేమగా ఉండాలని వేధించడంతో యాసిడ్ దాడికి పాల్పడినట్టు సుప్రియ వెల్లడించింది. తనతో పెళ్లికి కులం పేరుతో అడ్డు చెప్పి మరో యువతిని పెళ్లి చేసుకొని మళ్లీ ఇప్పుడు ప్రేమ పేరుతో వేధిస్తుంటే తట్టుకోలేక ఇలా చేశానని ఆమె తెలిపారు.

## కరోనా వ్యాధి దృష్ట్యా

### 37 కంటైన్మెంట్ జోన్‌లలో అత్యవసర పరిస్థితుల యందు తప్ప


### వారి గృహముల నుండి బయటకు వచ్చుట పూర్తి నిషిద్ధము



శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రజలకు ముఖ్య విజపి నగరంలో కరోనా వ్యాధి దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉన్నందున నగరంలో గల 37 కంటైన్మెంట్ జోన్ లలో గల ప్రజలు అత్యవసర పరిస్థితుల యందు తప్ప వారి వారి గృహముల నుండి బయటకు వచ్చుట పూర్తి నిషిద్ధము. నగరంలో ఉదయం 06.00 గం.ల నుండి మధ్యాహ్నం 01.00 గం వరకు మాత్రమే షాప్ లు తెరుచుటకు అనుమతి ఉన్నది. మధ్యాహ్నం ! 01.00 గం తరువాత షాపులు ఏవైనా తెరచి ఉంచిన యెడల వారి షాప్ లను మా సిబ్బందితో తాళాలు వేయబడునని మరియు సదరు యజమానులపై భారీ జరిమానా విధించబడునని తెలియజేయడమైనది. నగరంలో చాల చోట తోపుడు బళ్ళు ! వ్యాపారులు వ్యాపారం చేయడం నిషిద్ధం. వీరు నగరంలో గల ఆర్ట్స్ కాలేజీ రోడ్ మరియు 80 అడుగుల రోడ్ నందు మాత్రమే అనుమతిం చడమైనది. నగరంలో ఏర్పాటు చేసిన కంటైన్మెంట్ల వద్ద బారీకేడను తొలగించిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. నగరమునకు ప్రవేశ మార్గములైన ఆటపాలెం, పొన్నాడ, అరసవిల్లి, కిల్లిపాలెం, రామలక్ష్మణ జంక్షన్, బలగ ఎ.సి.బి ! ఆఫీసు వద్ద చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయుట జరిగినది. మద్యాహ్నం 01.00 గం. తరువాత నగరం లోనికి ఇతర ప్రాంతముల వారికి ప్రవేశం నిషిద్ధం. ఇందుపై నగరపాలక సంస్థ కార్యాలయము లో ఏర్పాటు చేసిన సమావేశమునకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ , శ్రీకాకుళం నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ బి.సత్యనారాయణ శ్రీకాకుళం నగరపాలక సంస్త పట్టణ ప్రణాళిక అధికారి జి. సీతారాం శ్రీకాకుళం నగరపాలక సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె. దక్షిణామూర్తి , శ్రీకాకుళం మండల తహసిల్దార్ ప్రసాద్ శ్రీకాకుళం 1 టౌన్ సి.ఐ అంబేద్కర్, మరియు 2 టౌన్ సి.ఐ పివి. రమణ శ్రీకాకుళం 1 టౌన్ యస్.ఐ సురేష్ , శ్రీకాకుళం 2 టౌన్ యస్.ఐ జగన్మోహనరావు పాల్గొన్నారు.

# ఈనెల 7వ తేదీ నుండి యోగా, ధ్యానము పై
## ఆన్‌లైన్ ఉచిత శిక్షణ ప్రారంభం

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, యువజన సర్వీసుల శాఖ, విజయవాడ వారి ఆధ్వర్యంలో 15 నుండి 35 సం॥ఎరాల మధ్య వయస్సు గల యువతీ యువకులకు ఆన్‌లైన్/వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా యోగా, ధ్యానం పై సెప్టెంబరు 7వ తేదిన శిక్షణ కార్యక్రమము ప్రారంభించి, ప్రతిరోజు ఉదయం 6 గంటలు నుండి ఉదయం 07.15 నిముషముల వరకు తరువాత తేది 08-09-2020 నుండి వారములో మంగళవారం నుండి ఆదివారము వరకు (సోమవారం శెలవు) మూడు నెలలు పాటు ఉచిత శిక్షణ ఇవ్వబడునని ఇదివరకు www.tiny.cc/yuvayoga వెబ్ లింకు నందు ఎవరైతే వారి పేర్లను పై శిక్షణా కార్యక్రమమునకు నమోదు చేసుకున్నవారు http://tegram.org/dl టెలిగ్రామ్ యాప్ కలిగియున్నవారు విశాఖపట్నం జిల్లాకు చెందిన యువ యోగా టెలిగ్రామ్ గ్రూపు లింకు అనగా http://t.me/yuva yoga visakhapatnam నకు లింకు చేసుకొనవలెను. కావున ఆసక్తి గల విశాఖపట్నం జిల్లాకు చెందిన స్మార్ట్ ఫోను ఉన్న అర్హత గల యువతి, యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోవాలని, ఇంకను ధరఖాస్తు చేసుకొననివారు పైన తెల్పిన టెలిగ్రామ్ యాప్ డౌనులోడు చేసుకొని మరియు విశాఖపట్నం జిల్లాకు చెందిన గ్రూపునకు లింకు చేసుకొనవలసినదిగా కోరడమైనది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్ ఇవ్వబడునని, మరిన్ని వివరాల కోసం 9849913079/9491553607 నెంబర్లకు సంప్రదించవచ్చునని ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్, విశాఖపట్నం వారు తెలియజేయడమైనది.




# ఈనెల 15 వరకు ఇగ్నో అడ్మిషన్లు
## జూలై 2020 విద్యా సంవత్సరానికి సెప్టెంబరు 15 వరకు గడువు పెంపు

విశాఖపట్నం : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో జూలై 2020 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడూవును సెప్టెంబరు 15వ తేదీ వరకు పెంచింది. ఈ మేరకు విశ్వ విద్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న కోర్సులతోపాటు మొత్తం 13 ఆన్‌లైన్ కోర్సు లకు, సుమారు 180 దూరవిద్యాకోర్సులకు అడ్మిషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. అన్ని రకాల సర్టిఫికేట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, పి.జి కోర్సులలో ప్రవేశాలకు సెప్టెంబరు 15 వరకు అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందే వీలుంది. ఇగ్నో వెబ్సైట్ లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. కొత్త ప్రవేశాలతో పాటు ఇదివరకు ఇగ్నో డిగ్రీ, పి.జి. కోర్సుల్లో ప్రవేశాలు పొంది ఇప్పుడు ద్వితీయ, తృతీయ సంవత్స రాల్లో చేరగోరేవారుకూడా సెప్టెంబరు 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయవచ్చు.

విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 5 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుంది. ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి.

ఫీజులు కూడా ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన కోర్సులలో ఎస్సి, ఎస్.టి. విద్యార్థులకోసం పూర్తి ఫీజు రాయితీకూడా విశ్వవిద్యాలయం కల్పిస్తోంది. మరిన్ని వివరాలకోసం ఇగ్నో వెబ్సైట్ చూడవచ్చు లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈ-మెయిలు ద్వారా సంప్రదించవచ్చు.

# తోలుబొమ్మల సిత్రాల బ్యానర్, వీడియో, లోగో ఆవిష్కరణ

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఎస్‌బి అంజాద్భాష**



కడప : ప్రజలకు మంచి వినోదాన్ని అందించే కామెడీ హర్రర్ కథతో రూపొందిం చిన తోలు బొమ్మల సిత్రాల బ్యానర్ ను ఆవిష్కరించడం జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి.అంజాద్భాష పేర్కొన్నారు. శుక్రవారం ఉప ముఖ్య మంత్రివర్యులు నివాసం నందు ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్‌బి. అంజాద్భాష తోలు బొమ్మల సిత్రాల బ్యానర్ లోగో, వీడియోను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా డైరెక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ ఈ చిత్రం యొక్క నిర్మాణ కార్యక్రమాలన్ని పూర్తయ్యాయన్నారు. ఈ బ్యానర్ ను ఉప ముఖ్యమంత్రి వర్యులు చేతుల మీదుగా ఆవిష్కరించడం ఎంతో శుభపరిణామమన్నారు. త్వరలో ఈ సినిమా టైటిల్ ను ప్రకటించడం జరుగుతుందన్నారు. తెలుగు ప్రజలందరూ ఈ బ్యానర్ ను, ఈ చిత్రాన్ని ఆదరించి ఆశీర్వదిస్తారని ఈ చిత్రం డైరెక్టర్ జానకిరామ్ కోరారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఏం. ప్రభాకర్, మరియు తోలు బొమ్మల సిత్రాల టీం తదితరులు పాల్గొన్నారు.

# గోవాడ సుగర్స్ లో ధన్వంతరి హెూమం నిర్వహణ



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ లో ధన్వంతరి హెూమం లో పాల్గొన్న ఫ్యాక్టరీ ఎండి సన్యాసినాయుడు, అధికారులు, కార్మికులు

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ లో కనకదుర్గ అమ్మ వారి సన్నిధిలో ధన్వంతరి హెూమ కార్య క్రమాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. షుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ సన్యాసినాయుడు, ఫ్యాక్టరీ అధికారులతో పాటు, ఫ్యాక్టరీ కార్మిక యూనియన్ (గుర్తింపు) అధ్యక్ష , కార్య దర్శులు రాయి సూరిబాబు, శరగడం రామునాయుడు పాల్గొన్నారు. కరోనా నివారణతో పాటు, ఫ్యాక్టరీ క్రషింగ్ లో ఆటం కాలు కలగకుండా ఉండాలని, ఫ్యాక్టరీ ఆర్థిక కష్టాల నుండి గట్టెక్కాలని కోరు కుంటూ వేదపండితుల ఆధ్వర్యంలో హెూమ పూజ నిర్వహించి, పండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు. ఈ కార్య క్రమంలో ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది
# ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటంనకు పాలాభిషేకం



భీమునిపట్నం : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి ఆద్వర్యంలో పంచాయత్ రాజ్ శాఖలో 51 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్సు పోస్టులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల తద్వారా...

రెండు దశాబ్దాల పిఆర్ ఎంప్లాయిస్ కలల్ని సాకారం చేస్తూ ప్రామోషన్లు లేకుండా యున్న ఎం.పి.డి.ఓలకు ప్రామోషన్లు కల్పించడం తద్వారా పిఆర్ డిపార్టుమెంటులో ఈ.ఓ.పి.ఆర్ & ఆర్.డి, ఎ.ఓ.లు, మినిస్టేరియల్ సిబ్బంది పంచాయితీ కార్య దర్శులు, ఆఫీస్ సబార్డినేట్లు వరకు 12 కేడర్లలో ప్రామోషన్లుకు నాంది పలకడం పట్ల కృతజ్ఞత భావంతో భీమునిపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయపు సిబ్బంది ముఖ్యమంత్రి చిత్రపటం నకు పాలాభిషేకం చేశారు.

# కరోనాపై అవగాహన ర్యాలీ



గొలుగొండ : శుక్రవారం గొలుగొండ మండలం జోగుంపేట గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి ఎం.రఘురాం ఆధ్వర్యంలో కరోనా పై అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తరణాధికారి లాలం సీతయ్య హాజరై మాట్లాడుతూ అందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి బౌతిక దూరం పాటించాలన్నారు. ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వెంటనే పిహెచ్‌సిలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగుంపేట సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



**31వ వార్డ్ పరిధి సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డు ప్రక్కన ఉన్న బోర్‌వెల్ పనిచేయడం లేదు అని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్, వార్డు మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ జివియంసి వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యను జివియంసి వాటర్ వర్క్స్ సిబ్బందితో పరిష్కరించారు. స్థానికులు రవికుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.**

# రాంబాబు కార్టూన్లు 'పుస్తకావిష్కరణ'



విశాఖపట్నం : కరోనా వ్యాధి వ్యాప్తి -నివారణ చర్యలు తదితర ఆరోగ్య అంశాలపై కోరాడ రాంబాబు వేసిన వంద కార్టూన్స్ తో రూపొందించిన 'రాంబాబు కార్టూన్లు' కార్టూన్ల పుస్తకాన్ని అనకాపల్లి ఎమ్.ఎల్.ఎ గుడివాడ అమర నాధ్ గురువారం మింది లో అవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి వ్యాధులపై అవ గాహన పెంపొందించు కొని, ఆరోగ్య నియమాలు పాటిం చడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచిం చారు. వ్యక్తిగత పరిశుభ్రత,సామాజిక దూరం, మాస్కులు ధరించడం వల్ల కరోనాను అదుపు చేయటం సాధ్యమవుతుందని చెప్పారు. కరోనా పై అవగాహన కలిగించడానికి కార్టూనిస్ట్ కోరాడ రాంబాబు చేసిన కృషిని అభినందించారు. కోరాడ రాంబాబు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ముందు జాగ్రత్తలు, ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటించడం ద్వారా అంటు వ్యాధులు నివారణ వీలవుతుందన్నారు. ప్రముఖ కార్టూనిస్ట్ బి.హరి, ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి.రవికాంత్, సీనియర్ జర్నలిస్ట్ ఇరోతి ఈశ్వరరావు, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## నిరంతర జ్ఞాన సముపార్జనతో
# మెరుగైన బోధన సాధ్యపడుతుంది
### వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ : నిరంతర జ్ఞాన సముపార్జనతో మెరుగైన బోధన పటిమ సాధించడం వీలవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల, జేఎన్‌టియూకె యుసిఇవి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. అధ్యాపకులు నిరంతరం నూతన జ్ఞానాన్ని, ఆవిష్కరణను తెలుసుకోవాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఆచార్యుల ప్రగతికి దోహదకారిగా నిలుస్తాయన్నారు. ఎఫ్‌డిపి కార్యక్రమ సమన్వయకర్త ఏయూ ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఆచార్య డి.లలిత భాస్కరి మాట్లాడుతూ...

డేటా సైన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఎస్‌టిఇఎం అంశంపై ఎఫ్‌డిపి నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకు ఎఫ్‌డిపి కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పోస్టర్ ఆవిష్కరణల కార్యక్రమంలో జెఎన్‌టియూవి ఐటి విభాగాధిపతి, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య జి.జయసుమ, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొనారు.

## వివేకానంద అనాధ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు
## మాస్కులు, చికెన్ బిర్యానీలు అందజేసిన సంఘసేవకులు యాసీన్ బాబ్జీ



విశాఖపట్నం : వన్‌టౌన్ వివేకా నంద అనాధ వృద్ధా శ్రమంలోని వృద్ధులకు.. ప్రముఖ సంఘ సేవ కులు.. యాసిన్ బాబ్జీ చికెన్ బిర్యానీలు, మాస్కులు అందజేశారు. ఆశ్రమం లోనే వృద్ధు లంతా.. ఆరోగ్యంగా, సంతోషంగా.. ఒకే కుటుంబ సభ్యుల్లా ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. తన వంతుగా వృద్ధుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. నిరుపేదల ఆకలి తీర్చడం కోసం.. 166 రోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దాతలు ముందుకు వస్తే ఇంకా మరి కొంతమంది ఆకలి తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలియజేశారు.

### ఆర్డబ్ల్యూఎస్ చెరువుకు, మూగజీవులకు రక్షణ ఏర్పాటు చేయాలి

కాత్రేనికోన : కాత్రేనికోనమండలం లో నడవపల్లి ఆర్డబ్ల్యూఎస్ కు చెందిన చెరువుకు రక్షణ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. శుక్రవారం చెరువులో ఆవు పడి పోయింది దీంతో సమీపాన ఉన్న యువకులు అక్కడికి చేరుకుని అవును రక్షించారు. చెరువు చుట్టూ ఆవులు గేదెలు మేకలు ఇష్టా రాజ్యంగా తిరుగుతున్న అప్పటికీ సరైన కాపలా వ్యవస్థ మూలంగా ఇటువంటి పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు తక్షణమే ఆర్డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయకపోతే పెనుముప్పు ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్థులు అంటున్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నెం. WAT-TRS-OT-9-2020-21

**పని పేరు మరియు ప్రదేశం:** ఎలక్ట్రిక్ లోకోషెడ్, విశాఖపట్నం వద్ద 3 ఫేజ్ లోకోమోటీవ్‌లలో వీల్ ఫ్లాంజ్ లూబ్రికేటర్ యొక్క సప్లయి, ఇన్‌స్టలేషన్ & కమీషనింగ్ చేయుట.

**టెండరు విలువ:** ₹ 3,86,19,104/-, బయానా: ₹ 3,43,100/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 11,800/-, పూర్తి చేయు కాలం: రెండు సంవత్సరాలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 25.09.2020న 1500 గంటలు

మాన్యువల్ ఆఫర్లు ఈ టెండరుకు అనుమతించబడవు. మరియు ఏవైనా అట్టి మాన్యువల్ ఆఫర్లు అందినచో తిరస్కరించబడతాయి.

పూర్తి వివరములు & టెండరు డాక్యుమెంట్లు మా వెబ్‌సైట్: http://www.ireps.gov.in నందు లభిస్తాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRS), విశాఖపట్నం

PR-235/L/20-21

**ఉత్తర రైల్వే**

**ఇ-టెండరు నోటీసు**

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు Pr.CE, ఉత్తర రైల్వే, హెడ్ క్వార్టర్స్ కార్యాలయం, బరోడా హౌస్, న్యూఢిల్లీ-110001 వారు క్రింది టెండర్లకై ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఇ-టెండరు కోరుచున్నారు.

| టెండరు నెం.211-2654-2019-20-NR | గడువు తేది : 28.09.2020 |
| --- | --- |
| ఐటమ్ యొక్క వివరణ | ఉత్తర రైల్వే థెర్మిట్ పోర్షన్ ప్లాంట్ లక్నో యొక్క ప్రామాణిక స్పెసిఫికేషన్ TPP/FeMo/2020 ప్రకారం ఫెర్రో మాలిబ్డినమ్ తయారీ సరఫరా |
| టెండరు విలువ | రూ.1,05,05,669.8 |
| టెండరు డాక్యుమెంటు విలువ | రూ. శూన్యం |
| ధరావతు | రూ. 2,10,120/- |
| పని పూర్తి కాలం | 12 నెలలు |
| టెండరు సమర్పణ గడువు తేది | 28.09.2020న 14:30 వరకు IST |
| టెండరు తెరుచుతేదీ&సమయం | 28.09.2020న 14:30 వరకు IST |
| ఆఫరు పరిమితి | 180 రోజులు |

గమనిక :- పై ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు పూర్తి సమాచారము www.ireps.gov.in మరియు www.nr.indianrailway.gov.in వెబ్‌సైట్లలో లభించును. ఇ-టెండరు ప్రకటన No.196-S/71/2019-20 టెండరు ప్రకటన/ TS/FeMo తేది : 04.09.2020 1928/2020

వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు

# విజయభాను

## సంపాదకీయం

### కుంచించిన ఆర్థికం

మన దేశ జీడీపీ వృద్ధి ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో 23.9 శాతం కుంచించుకుపోయిందనేది భయం గొలుపుతున్నది. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా మనది అతి వేగంగా దిగజారిపోతున్నది. సమీప భవిష్యత్తులో కూడా పుంజుకునే సూచనలు కనబడటం లేదు. అవ్యవస్థీకృత రంగపు గణాంకాలు బయటకు వచ్చినప్పుడు పరిస్థితి మరింత ఘోరంగా కనపడుతున్నది. ఈసారి మొత్తం ఆర్థిక సంవత్సరంలోనే ప్రతికూల వృద్ధి ఉంటుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూస్తే వ్యవసాయరంగం ఒక్కటే మెరుగ్గా ఉన్నది. కరోనా గండం గట్టెక్కినా ఆ తరువాత ఆర్థిక పరిస్థితి ఏమిటనే ఆందోళన ఎంతో కాలంగా వ్యక్తమవుతున్నది. సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఏమి చేయదలుచుకున్నదనేది ప్రశ్నార్థకం.

లాక్‌డౌన్ ప్రకటించిన ప్రాంతాలలో అత్యధికం దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలే. దేశంలోని డబ్బు శాతం ఉత్పత్తి, వినియోగం లాక్‌డౌన్ ప్రాంతాలలో జరిగేదే. అందువల్ల కరోనా వైరస్ ప్రభావం ఆర్థికవ్యవస్థపై తీవ్రంగా పడింది. భారత ఆర్థికవ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం- దేశంలో దాదాపు కోటీ తొమ్మిది లక్షల మంది వేతన ఉద్యోగులు రోడ్డున పడ్డారు. పలు రంగాల్లో మూసివేతలు, తొలగింపుల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నది. ఆర్థికరంగ చోదకశక్తుల్లో దాని పరిస్థితీ ఆశాజనకంగా లేదు. దేశంలో వినియోగం 27 శాతం అంటే 5,31,803 కోట్ల రూపాయల మేర పడిపోయింది. వ్యాపార రంగ పెట్టుబడులు 5,33,003 కోట్ల మేర పడిపోయాయి. ఎగుమతులు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వరంగ పెట్టుబడుల మీద ఆశ ఉండటం సహజం. కానీ ప్రభుత్వ వ్యయం పదహారు శాతం అంటే దాదాపుగా 68,387 కోట్లు మాత్రమే పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలు ఏ మాత్రం ప్రభావం చూపలేదని స్పష్టమవుతున్నది.


ఆర్థికవ్యవస్థను నిర్వహించడంలో మోదీ ప్రభుత్వం మొదలు నుంచీ తడబడుతున్నది. లాక్‌డౌన్ మొదలు కాకముందే మన ఆర్థికవ్యవస్థ మందగమనంలో ఉన్నది. కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేయడం ఆర్థికవ్యవస్థపై పడిన పెద్ద దెబ్బ. ఆ తరువాత జీఎస్టీ అమలు ప్రతికూల ప్రభావం చూపింది. ఈలోగా కరోనా వైరస్ దాపురించింది. రాబోయే విపత్కర పరిస్థితిని గ్రహించడం వల్లనే ముఖ్యమంత్రి కేసీఆర్ హెలికాప్టర్ మనీని ప్రతిపాదించారు. కానీ కేంద్రం పట్టించుకోలేదు. తెలంగాణ అనుభవాల నేపథ్యంలోనే కేసీఆర్ ఈ సూచన చేశారు. కేసీఆర్ తెలంగాణలో భారీ ఎత్తున మౌలిక వసతుల పథకాలు చేపట్టారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లక్షల కోట్ల రూపాయలను సమాజంలోకి ప్రవహింపజేశారు. కేసీఆర్ వేగంగా స్పందించి ఈ చర్యలు చేపట్టకపోతే రాష్ట్రం పరిస్థితి ఘోరంగా ఉండేది. ఇప్పటికైనా కేసీఆర్ సూచనలను ప్రధాని మోదీ పరిగణనలోకి తీసుకుంటే దేశం బాగుపడుతుంది.

## ఆర్‌సీబీని ఎప్పటికీ వదిలిపెట్టను : విరాట్ కోహ్లి



ఐపీఎల్ ప్రారంభం నుంచి ఒకే ఫ్రాంచైజీతో ఉన్న ఏకైక ఆటగాడు విరాట్ కోహ్లి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు 18 ఏండ్ల కోహ్లిని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దక్కించుకుంది. 12 సంవత్సరాలు జట్టుతోనే ఉన్న కోహ్లి ఈ ఏడాది 13వ సీజన్ ఆడడానికి యూఏఈ చేరుకున్నాడు. 2011లోనే కోహ్లి ఆర్‌సీబీకి కెప్టెన్ అయ్యాడు. 2016లో ఐపీఎల్ ఒకే ఎడిషన్‌లో అత్యధికంగా 973 పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ రికార్డు సృష్టించాడు. మొత్తం ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో విరాట్ కోహ్లినే ముందున్నాడు. ఆర్‌సీబీ రెండు సార్లు 2009, 2016లో ఫైనల్ వరకు వచ్చి కప్పు సాధించలేకపోయింది. అయితే ఆర్‌సీబీ ఇప్పటివరకు ట్రోఫీ గెలుచుకోకపోయినా జట్టు ఫ్రాంచైజీ మాత్రం కోహ్లిని వదులుకోకపోవడమే కాకుండా అతడిపై పూర్తి నమ్మకాన్ని ఉంచింది. ఇదే విషయమై ఇటీవల ఆర్‌సీబీ ట్విట్టర్‌లో పోస్టు చేసిన వీడియోలో విరాట్ మాట్లాడుతూ "జట్టుతో నా ప్రయాణం మొదలై 12 సంవత్సరాలు పూర్తయ్యింది. ఇది ఒక అద్భుతమైన ప్రయాణం. చాలామంది అభిమానుల కోసం ఆర్‌సీబీ అంతిమ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నాం. మేము మూడుసార్లు దగ్గరగా వచ్చాం.. కానీ ట్రోఫీ గెలువలేకపోయాం." అని చెప్పాడు. "ఇది ఎల్లప్పుడూ మా కలగా ఉంటుంది. ఈ జట్టును విడిచిపెట్టాలని నేను ఎప్పుడూ ఆలోచించలేదు. అలాంటి సందర్భం కూడా రాలేదు. మా ఫ్రాంచైజీ నాపై ప్రేమ, సంరక్షణ ఎల్లప్పుడూ చూపుతేనే ఉంది. నేను ఈ జట్టును ఎప్పటికీ వదిలిపెట్టను." అని విరాట్ అన్నాడు.

## రెండుసార్లు ఓటేయండి.. టెన్షన్ పుట్టిస్తున్న ట్రంప్




హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ఆ దేశ ఎన్నికల అధికారులను టెన్షన్‌లో పడేశారు. నార్త్ కరోలినాలో ప్రచారం కోసం వెళ్లిన ట్రంప్.. అక్కడ మాట్లాడుతూ.. ప్రజలు రెండు సార్లు ఓటేసేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3వ తేదీన జరగాల్సి ఉన్నది. అయితే కోవిడ్ నేపథ్యంలో మెయిల్ ఓటింగ్ నిర్వహించనున్నారు. దీన్ని ట్రంప్ వ్యతిరేకిస్తున్నారు. మెయిల్ ఓటింగ్ ద్వారా డెమోక్రటిక్ పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉన్నట్లు ట్రంప్ ఆరోపిస్తున్నారు. అందుకే నార్త్ కరోలినా ప్రజలు రెండు సార్లు ఓటు వేయాలన్నారు. తొలుత మెయిల్ ద్వారా ఓటు వేయడం.. ఆ తర్వాత పోలింగ్ బూత్‌లో బ్యాలెట్ ఓటును కూడా వినియోగించుకోవాలన్నారు. ఈ పద్ధతిలో ఓటింగ్ నిర్వహిస్తే, అక్రమాలు జరగవన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో రెండు సార్లు ఓటు హక్కును వినియోగించుకోవడం నేరం. ఆ దేశ ఎన్నికల సంఘం కూడా ఇదే చెబుతున్నది. రెండుసార్లు ఓటు వేయాలని ట్రంప్ కామెంట్ చేయగానే.. నార్త్ కరోలినా ఎన్నికల బోర్డు ప్రకటన జారీ చేసింది. రెండు సార్లు ఓటు వేయడం చట్టవ్యతిరేకమన్నది. ఫెడరల్ చట్టానికి విరుద్ధమని ఎన్నికల సంఘం పేర్కొన్నది. ట్రంప్ ఆ వ్యాఖ్యలు చేసి నేరానికి పాల్పడినట్లు ఎన్నికల అధికారులు ఆరోపిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించాలని అధ్యక్షుడు రెచ్చగొట్టడం సరికాదు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌కు వెళ్లి మెయిల్ ద్వారా పంపిన ఓటును లెక్కించారా లేదో చూసుకోవాలని, ఒకవేళ ఓటును లెక్కిస్తే, అప్పుడు మరోసారి ఓటు వేయాల్సిన అవసరం లేదని, అంటే మెయిల్ పద్ధతిలో ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగుతుందని అర్థం చేసుకోవచ్చు అని ట్రంప్ తెలిపారు. నార్త్ కరోలినాలోని పోలింగ్ సెంటర్లలో ఎలక్ట్రానిక్ పోల్ బుక్స్ ఉంటాయి. వాటిల్లో ఎవరు ఓటేశారో తెలిసిపోతుంది. ఓటు వేసిన వారి పేర్లు, వివరాలు ఎలక్ట్రానిక్ బోర్డుపై కనిపిస్తాయి. ఒకవేళ మీ పేరు లేకుంటే, అప్పుడు మీరు బ్యాలెట్ ఓటు వేయాలని ట్రంప్ అన్నారు. అయితే కరోనా నేపథ్యంలో మెయిల్ ఓటు వేసిన వారు పోలింగ్ బూత్‌కు రావద్దు అని, వారి ఓటింగ్ వివరాలను ఎలక్షన్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు అని ఎన్నికల అధికారులు తెలిపారు.

## సమకాలీనం (కవి సమయం)

### ఓటు రాజ్యము

దేవుని సంపద మనుష్యుల్లారా...
దప్పికి కరువు దేశం గాదా?
నడిపిన వారికి దయ వుండాలి?
ఎల్తిగ లేక నడపాలండి.
ఎప్పుడు పోవును పేదరికాలు?
తిప్పలు తోను జనులకు బతుకు
కడిగిన కొలది పేదలు హెచ్చు
తప్పవ యీ బతుకులు ప్రజలకు.
ఓటు రాజ్యము - ధరలకు పెరుగు
ఏమికొందుమా - గుండెకు బెగులు
ఎట్లా... అంటే...?
కాదను కుంటే...?
అట్లా... అయితే..?
పని, పాట్లంతే?
ఐక్య వేదికలు పెడుతున్నా...
చర్చలతోనూ...
కాలయాపనా...
కాలం నడకలు కాలందే...
మాటలు, వరుసలు మాటలవే...
మారేదెప్పుడు మన చోట...
మారేదెప్పుడు పాలన బాట.
జనాలుతో... జగడమాడితే...?
గొప్పకాదురా?
ధరలను బాగ అదుపు చేయరా...
జనాలు మీకు పూజింతురు రా...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి : తదియ ప.2.09; రేవతి రా.1.08; ఉ.వ.11.52ల 1.38

శనివారం 05 -09 -2020

**మేషం:** ప్రేమికుల మధ్య నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. **వృషభం :** ఆకస్మిక ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. నిరుద్యోగులకు కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. స్త్రీలకు వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. ఆడిటర్లకు, అకౌంట్స్ రంగాల వారికి పనిభారం అధికంగా ఉంటుంది. **మిథునం :** చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఖర్చులు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్లు స్వీకరిస్తారు. **కర్కాటకం :** ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి అనుకున్నది సాధిస్తారు. అనుకోకుండా ఏర్పడిన ఒక స్నేహబంధం భవిష్యత్‌లో మీకు మంచే చేస్తుంది. సంతానం విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. ఖర్చులు సామాన్యం. **సింహం :** మొండి బాకా యిలు వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు. కుటుంబ విషయాలు, ఆర్థిక లావాదేవీలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. **కన్య :** నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగు తాయి. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైన సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. పత్రిక, ప్రైవేటు సంస్థలలో వారికి మార్పులు అను కూలిస్తాయి. **తుల :** దూర ప్రయాణాలలో మెళకువ అవసరం. తలపెట్టిన పనుల్లో ఒకింత జాప్యం, చికాకు తప్పదు. స్త్రీలు షాపింగ్ వ్యవహారా లలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త అవసరం. ఆత్మీయుల నుంచి సహాయాన్ని పొందుతారు. **వృశ్చికం :** విద్యార్థులు అతి కష్టం మీద పై చదువులకు అవకాశం లభిస్తుంది. మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభి వృద్ధి. చేతి వృత్తుల వారికి ఓర్పు, నేర్పు ఎంతో అవసరం. నూతన పరిచయాలు ఏర్పడతాయి. **ధనుస్సు :** వాహనం నడుపునపుటలో మెళకువ అవసరం. రాజకీయ నాయకులకు పదవి సమస్యలు అధికమవుతాయి. మిత్రుల సహకారంచో ఓ సమస్యను సునాయాసంగా పరిష్కరిస్తారు. కంప్యూటర్ రంగాల వారికి పురోభివృద్ధి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాల్లో మెళకువ వహించిండి. **మకరం :** సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాలు గూర్చి తగాదాలు రావచ్చు. దైవ కార్యాలలో పాల్గొంటారు. రావలసిన ధనం చేతికందకపోవడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరగలదు. నిరుద్యో గులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునః ప్రారం భించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. **కుంభం :** కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు అదనపు సంపాదన దిశగా ఆలోచన చేస్తారు. **మీనం :** కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో క్రమేణా నిలదొక్కు కుంటారు. ప్రముఖులతో ముఖ్య వ్యవహారంపై సంప్రది ంపులు జరుపుతారు. రుణ యత్నాల్లో ఆటంకాలు తొలగిపోతాయి. రావలసిన ధనం చేతికందుతుంది. గృహంలో దైవ కార్యక్రమాలుచేయుట వంటి శుభ పరి ణామాలు ఎదు ర్కుంటారు. స్త్రీలకు పనిభారం అధికం.

## మెంటార్‌గా యువీ!

### లాక్‌డౌన్‌లో కుర్రాళ్లకు శిక్షణ




యువీ.. ఆరు సిక్సర్లతో అదరగొట్టాడు. హ్యాట్రిక్ వికెట్లు తీసి మురిపించాడు. టీమ్‌ఇండియాకు ప్రపంచకప్‌లు అందించాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఆపద్బాంధవుడు అయ్యాడు. ఇప్పుడు మెంటార్ అవతారం ఎత్తాడు. అయితే ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఏదో ఒక జట్టుకు కాదు. ఈ సీజన్‌లో రాణించాలనుకునే పంజాబ్ యువ క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తున్నాడు యువరాజ్.

అంతర్జాతీయ క్రికెట్ వీడ్కోలు పలికిన తర్వాత యువరాజ్ సింగ్ కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతున్నాడు. తన స్వచ్ఛంద సంస్థ పనులు చూసుకుంటున్నాడు. సరదా కోసం విదేశీ పొట్టి క్రికెట్ లీగులు ఆడుతున్నాడు. అంతేకాకుండా అప్పుడప్పుడు యువ క్రికెటర్లను తీర్చిదిద్దే పని పెట్టుకున్నాడు. కొన్ని రోజుల క్రిత పంజాబ్ క్రికెట్ సంఘం ఏర్పాటు చేసిన శిబిరంలో ఆటగాళ్లకు సలహాలు ఇచ్చాడు. ఒత్తిడిని ఎలా తట్టుకోవాలి? మ్యాచ్ పరిస్థితులను ఎలా అర్థం చేసుకోవాలి? ఏయే సందర్భాల్లో ఎలా ఆడాలి? బ్యాటింగ్ టెక్నిక్‌లో చేసుకోవాల్సిన మార్పులు? మానసికంగా దృఢంగా ఉండటం ఎలా? అనే అంశాలను యువ క్రికెటర్లకు బోధించాడు.

ఇప్పుడేమో ఐపీఎల్‌లో ఆడుతున్న పంజాబ్ క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తున్నాడు. లాక్‌డౌన్ సమయంలో పీసీఏ జిమ్ అందుబాటులో లేకపోవడంతో శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభుసిమ్రన్ సింగ్, అన్మోల్ ప్రీత్‌సింగ్ కసరత్తులు చేసేందుకు తన సొంత జిమ్‌ను అప్పగించాడు. త్వరగా దేహదారుఢ్యం సాధించేదుకు సలహాలు ఇచ్చాడు. అంతేకాకుండా వారికి క్రికెట్ పాఠాలు చెప్పాడు. మానసిక దృఢత్వం గురించి బోధించాడు. చక్కని ఆహారాన్ని అందిస్తూ సొంత తమ్ముళ్లుగా ఆదరించాడు. అందుకే సీజన్ పూర్తయ్యే వరకు యువీతో టచ్‌లో ఉంటామని, అవసరమైన సలహాలు అడుగుతామని ఆ కుర్రాళ్లు అంటున్నారు. సెప్టెంబర్19 నుంచి నవంబర్ 10 వరకు ఐపీఎల్ 2020 జరుగుతున్న సంగతి తెలిసిందే.

## సంకీర్తన

## అదే సుబ్రహ్మణ్యస్వామి మహిమ!



భక్తుల కోరికలను నెరవేర్చడం కోసం సుబ్రహ్మణ్య స్వామి వివిధ ప్రదేశాల్లో అవతరించాడు. అలాంటి విశిష్టమైన క్షేత్రాల్లో ఒకటి అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం 'కోటంక' గ్రామంలో దర్శనమిస్తుంది. ఇక్కడి సుబ్రహ్మణ్య స్వామి మహి మాన్వితుడని భక్తులు విశ్వసిస్తుంటారు. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశాడనీ .. పూర్వం స్వామి సర్ప రూపంలో మహర్షులకు దర్శనమిస్తూ వుండేవాడని చెబుతుంటారు.

ఇక్కడ స్వామివారి సన్నిధిలో పాతాళగంగ వుంది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఇందులోని నీటి ధార తగ్గకపోవడం విశేషంగా చెప్పుకుంటూ వుంటారు. ఇది స్వామివారి మహిమగా విశ్వసిస్తూ వుంటారు. ఈ నీటిని స్వామివారి అభిషేకానికి ఉపయోగిస్తారు. పాతాళ గంగలోని నీటిని తీర్థంగా స్వీకరించడానికి భక్తులు మరింత ఆసక్తిని చూపుతారు.

ఈ నీటిని తీర్థంగా స్వీకరించడం వలన, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుముఖం పడతాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు. వివాహం విషయంలోను .. సంతాన భాగ్యం విషయంలోను ఆలస్యమవుతున్నప్పుడు, ఈ స్వామిని దర్శించుకుని మనసులో మాట చెప్పుకుంటే ఆ కోరిక నెరవేరుతుందని అంటారు. ఈ క్షేత్రంలో అడుగుపెట్టడం వలన సమస్త దోషాలు తొలగిపోతాయనీ, పుణ్యఫలాలు చేకూరతాయని చెబుతారు. విశేషమైన పర్వదినాల్లో స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. ఆహ్లాదకరమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది.

## శివలింగారాధన ఫలితం!



పరమశివుడు లింగరూపంలో ఆవిర్భవించి, భక్తులచే పూజాభిషేకాలు అందుకుంటున్నాడు. శివలింగారాధన వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. బంగారం .. వెండి వంటి లోహపదార్థాలతో తయారు చేయబడిన శివలింగాలను, బాణలింగం .. స్ఫటిక లింగం వంటి వాటితో రూపొందించబడిన శివలింగాలను పూజించడంవలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని చెప్పబడుతోంది. మట్టితోను .. వెన్నతోను .. పిండితోను ఇలా వివిధ రకాల పదార్థాలతో తయారుచేయబడిన శివ లింగాలను ఆరాధించడం వలన, పుణ్య రాశి పెరుగుతుంది. మనసులోని కోరికలను బట్టి ఆయా శివలింగ రూపా లను పూజించవలసి వుంటుంది. సాధా రణంగా చాలామంది ఆరోగ్యాన్ని .. ఐశ్వ ర్యాన్ని కోరుకోవడం జరుగుతూ వుంటుంది. ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి ఐశ్వర్యం .. ఆరోగ్యం రెండూ అవసరమే. అందువలన వాటిని కోరుకోవడం జరుగుతూ వుంటుంది.'పటిక బెల్లం'తో తయారు చేయబడిన శివలింగాన్ని పూజించడం వలన, ఆరోగ్యం కలుగుతుందని చెప్పబడుతోంది. ఇక ఐశ్వర్యాన్ని కోరుకునేవారు 'కపిల గోవు' పేడతో చేసిన శివలింగాన్ని ఆరాధించవలసి ఉంటుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ శివలింగాలను పూజించడం వలన, ఆశించిన ఫలితం తప్పక లభిస్తుందని స్పష్టం చేయబడుతోంది.

# 'చదువు'లమ్మ 'ఒడి' - సర్కార్ 'బడి'

- వేగవంతమైన నాడు - నేడు పనులు - నేటి నుంచి జగనన్న విద్యా కానుకలు పంపిణీ
- ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి - మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు


మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు


దేవరాపల్లి ఆదర్శ పాఠశాలలో చురుగ్గా సాగుతున్న నాడు నేడు పనులు


పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు


విద్యార్థులకు అందజేయనున్న ఆటవస్తువులు

దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించడంతో పాటు ప్రేవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు అడుగులు ముందుకు వేసింది. వేలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు పిల్లలను పంపి తల్లిదండ్రులు పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి నాడు-నేడు కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రూపకల్పన చేశారు. అందులో భాగంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నూతనంగా ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు లబ్ధి పొందడంతో వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా నాడు-నేడులో పాఠశాలలకు సౌకర్యాలు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు యూనిఫారం, బూట్లు, బెల్టులు, టై, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, ప్రస్తుతం సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీనితో ప్రైవేటు పాఠ శాలలో చదివే విద్యార్థులు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో ని అడ్మిషన్ శాతం పెరుగుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. మండలంలో ఎం పి పి, ఎంపి యుపి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ విద్యాలయంతో పాటు మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో నాడు-నేడు పథకం కింద తొలివిడతగా మండలంలో 21 పాఠశాలలకు రూ. 262. 65 కోట్ల రూపాయలు వెచ్చించి ఆయా పాఠశాలలకు అన్ని హంగులు సమకూర్చే విధంగా పనులను వేగవంతం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలోని మొత్తం 6, 940 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 3, 640 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు రావాల్సి ఉంది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 19 వేల 774 నోట్ బుక్స్ రావాల్సి ఉండగా 6, 395 నోట్ పుస్తకాలు వచ్చాయి. ఇంకా 13 వేల 379 రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా టెస్ట్ పుస్తకాలు 8, 376 వర్క్ బుక్స్ 6, 136 అందుబాటులో ఉన్నాయి. అన్ని పాఠశాలలకు 19 రకాల స్పోర్ట్స్ మెటీరియల్ కూడా వచ్చాయి. త్వరలో పెండింగ్లో ఉన్నవన్నీ తమ కార్యాలయానికి చేరుకుంటాయని మండల విద్యాశాఖఅధికారి సిహెచ్. రవీంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న పాఠ్య పుస్తకాలు, స్పోర్ట్స్ కిట్లు, ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామన్నారు. నాడు-నేడు పనులు దాదాపు పూర్తయ్యాయని పాఠశాలల పునః ప్రారంభానికి అంతా సిద్ధం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు.

## హీరో కృష్ణ సీనియర్ అభిమాని దుక్కా సత్యనారాయణ గుండెపోటుతో మృతి



విశాఖపట్నం : ప్రముఖ సినీ నటుడు హీరో కృష్ణ తొలి సీనియర్ అభిమాని దుక్కా సత్యనారాయణ అనారోగ్యంతో మరణించారు. బాలయ్య శాస్త్రి లేఔట్ లో నివాసం ఉంటున్న ఆయన గుండెపోటు రావడంతో కన్నుమూశారు. నగరంలో కృష్ణ సీనియర్ అభిమానిగా ఆయనకు ఎంతో పేరుంది. కృష్ణ, మహేష్ బాబు కుటుంబ సభ్యులు పుట్టిన రోజులు సందర్భంగా జరిగే పలు సేవా కార్యక్రమాలలో పాల్గొని సేవలందించారు. హీరో కృష్ణ తో ఎంతో సన్నిహితంగా ఉంటూ పలు సినిమా విజయ ఉత్సవాలలో పాల్గొన్నారు. దుక్క సత్య నారాయరణ మృతి పట్ల విశాఖ సిటీ అభిమాన సంఘం సరస్వతి పార్క్ అధ్యక్షుడు డోప్ప రమణ, బి. సి.చ్.అప్పారావు, విశాఖ సిటీ కృష్ణ అభిమాన సంఘం డైమండ్ పార్క్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం (బుజ్జి), జెర్రీ రమేష్ రెడ్డి. కృష్ణ అభిమాని డి.మురళీకృష్ణ తదితరులు వారి కుటుంబ బంధు మిత్రు లకు ఒక ప్రకటనలో సానుభూతి తెలిపారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

## మూగబోయిన బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు




దేవరాపల్లి : మండల కేంద్రంలో మూడు రోజులుగా బి ఎస్ ఎన్ ఎల్ నెట్వర్క్ పనిచేయకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు నిత్యం వివిధ పనులపై దేవరాపల్లి వచ్చి తీరా వారికి ఆ పనులు అవక నిరాశతో వెనుతిరిగి పోతున్నారు. బిఎస్ఎన్ఎల్ నెట్ పనిచేయక ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాలలో సిబ్బంది గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చున్న ఫలితం కనిపించడం లేదు. ఈ నెల 3 నుంచి ప్రభుత్వం డిపోల ద్వారా ఉచిత సరుకులు సరఫరా చేస్తున్నారు. అయితే పలు చోట్ల సర్వర్లు పనిచేయక ఉచిత రేషన్ నిలిచిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బి ఎస్ ఎన్ ఎల్ నెట్వర్క్ పని చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్భాష



కడప : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి వర్యుల నివాసం నందు ఉప ముఖ్యమంత్రి వర్యులకు పలువురు బాధితులు తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా కడప పట్టణం ఇందిరా నగర్ కు చెందిన ఇ. రాణి తాను రైల్వేకోడూరులో సి హెచ్ సి నందు అవుట్సోర్సింగ్ కింద ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ గా పని చేయుచున్నానని అక్కడినుంచి తనను కడప మండలానికి బదిలీ చేయించాలని వినతిపత్రం సమర్పించారు. చింతకొమ్మదిన్నె మండలం నరసన్నపల్లెకు చెందిన సయ్యద్ రాజు తాను ఐటిఐ వెల్డర్ ట్రేడ్ పాస్ అయ్యానని తనకు అప్రెంటిస్షిప్ ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. కడప పట్టణం నకాష్ కు చెందిన ఎస్.అంజుమ్ తన భర్త ఫిరోజ్ క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడని ఉప ముఖ్యమంత్రి వర్యులకు తెలపగా వెంటనే ఉప ముఖ్యమంత్రి వర్యులు స్పందించి ఒక నెలకు సరిపడా మాతర్లు ఉచితంగా ఇవ్వాలని పి ఎ. కాజాకు సూచించారు. ఈ సందర్భంగా పలు వురు బాధితులు తమ సమస్యలను అర్జీ రూపంలో ఉపముఖ్యమంత్రి వర్యులకు అంద జేశారు. బాధితుల సమస్యలన్నీ సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిస్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి వర్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుబాన్ భాష, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## పతంజలి యోగా పీఠ్ హరిద్వార్ ఆధ్వర్యంలో 100 గంటల ఆన్లైన్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరం

భీమునిపట్నం : పతంజలి యోగా సమితి పతంజలి యోగ పీఠ్ హరిద్వార్ ఆధ్వర్యంలో 100 గంటల ఆన్లైన్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరం ఈనెల 5నుంచి. ప్రారంభం అవుతుంద ని నిర్వాహకులు ఎ.ఎస్ రవి, టి.ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. ఉదయం 6 గం -8, సాయంత్రం 6 గం -7, శిక్షణ ఉంటుందని,ఈ కార్యక్రమంలో యోగాఒరిజినల్ కాన్సెప్ట్, అష్టాంగ యోగ, పంచకర్మ, ఆక్యుప్రెషర్, ఆయుర్వేద థెరపీ, హ్యూమన్ అనాటమీ, పంచతత్వ, పంచసఖా, హీలింగ్ రొటీన్, సప్తదట్టు, వేద పురాణం, ఉపనిషద్, గీతా దర్శనం, హఠా యోగా, రోగను సర యోగా, హెూమ్ మెడిసిన్ ఉంటాయనీ చెప్పారు.స్వాతం రాందేవ్ మహారాజ్, పతంజలి యోగాపిఠ్ హరిద్వార్ యొక్క అత్యంత యోగి సేజ్, భారత ప్రభుత్వ ఆయుష్ విభాగం డైరెక్టర్ ఈశ్వర్ బసవరెడ్డి, కేంద్ర పతంజలి ప్రముఖులు సాద్వి దేవప్రియ జీ.జయదీప ఆర్య, దక్షిణ భారత దేశ ఇన్చార్జ్ బవర్ లాల్ ఆర్యా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీచర్స్ ట్రైనింగ్ ఇన్చార్జ్ బాలసుబ్రహ్మణ్యం, పతంజలి యోగా పీఠ్ కు సంబంధించిన అనుభవజ్ఞులైన యోగా నిపుణులు నాగార్జున యూనివర్సిటీ యోగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ.రాధిక శిక్షణ ఇస్తారనీ కరోనా కాలంలో యోగా ప్రాణాయామం, ఆయుర్వేద, స్వదేశీ చికిత్సా పద్ధతులు ప్రతిభా వంతంగా ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపించ బడిందని అన్నారు.

ఇందులో పాల్గొనేవారికి యోగా సర్టిఫి కేషన్ బోర్డు (వైసిబి) స్థాయి 1 (యోగా బోధ కుడు), స్థాయి 2 (యోగా వెల్నెస్ బోధకుడు) మరియు స్థాయి 3 (యోగా ఉపాధ్యాయ, మూల్యాంకనం) పరీక్ష లలో భారత ప్రభుత్వ ఆయుష్ విభాగం కింద శిక్షణ ఇస్తారని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం,ప్రైవేటు రంగంలో యోగా ఉపాధ్యాయులను నియ మించేటప్పుడు ఈ ధృవ పత్రాలకు ప్రాధాన్యత ఉపయోగ పడతా యని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ 79890 55134, 6301413438 నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

## వెంకన్నపాలెం లో 15 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ


లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న సెక్రటరీ గంగాధర్, స్థానిక వైసీపీ నాయకులు

చోడవరం : మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో 15 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లను పంపిణీ చేసినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. కొత్త పింఛన్లను గంగాధర్ తో పాటు స్థానిక వైసీపీ నాయకులు పిల్లల గోవిందా, సన్నీ, రాంబాబు, అప్పల నాయుడు, పాము అప్పలనాయుడు, ఎం.ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అక్షరాలు నేర్పిన గురువులను పూజిద్దాం : కృష్ణకుమారి



అరకులోయ : ఆదియుగం నుంచి ఆధునికయుగం వరకు ఆయనే రుషి. జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు ఆయనెవరో కాదు మనందరికీ విద్యా బుద్ధులు నేర్పే గురువు అందుకే మన సమాజంలో అమ్మానాన్నల తర్వాత స్థానం గురువులకు ఇచ్చారని ఎచ్.ఆర్.సి.ఏ జిల్లా మహిళ అధ్యక్షులు కృష్ణకుమారి అన్నారు.ఈ సందర్భంగా ఆమె అంటూ,లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువైతే గుండెలపై తన్నుతూ ఆటలాడే శిశువుకు నడక నేర్పే నాన్న రెండో గురువు ఆ తర్వాత ఈ లోకంలో ఎలా నడుచుకోవాలో నేర్పి,విద్యా బుద్ధులు అందించే ఉపాధ్యాయుడు మూడో గురువు. అందుకే పెద్దలు మాతృదేవో భవ.పితృదేవో భవ ఆచార్య దేవోభవ అన్నారు.ఇంతటి ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి,గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన మన దేశ రెండో రాష్ట్రపతి, మేధావి,విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ జయంతిని ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవంగా గుర్తించింది.ప్రతి యేటా సెప్టెంబర్ 5 న గురువులను గౌరవించుకునే అవకాశాన్ని కల్పించింది ఈ నేపథ్యంలో గురువు గొప్పదనం, ఉపాధ్యాయ దినోత్సవం విశిష్టత తెలుసుకుందాం. ప్రతి ఒక్క గురువులను నేడు గొప్పగా పూజించే రోజే ఉపాధ్యాయులు దినోత్సవం అని ఎచ్.ఆర్.ఎ. సి ఏ జిల్లా అధ్యక్షులు కె. కృష్ణకుమారి అన్నారు.

## చింతకాయల దంపతులు వైసీపీలో చేరిక

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అధీప్‌రాజ్



పరవాడ : పరవాడ మండలం టీడీపి మాజీ వైస్ ఎంపీపీ చింతకాయల సుజాతముత్యాలు శుక్రవారము పెందుర్తి ఎమ్మెల్యే ఆధీప్‌రాజు సమక్షంలో సుజాతనగర్, కళ్యాణమండపంలో 500 మంది కార్యకర్తలతో వైసీపీ లో జాయిన్ అయ్యారు.ఆయనతో పాటు ముత్యాలమ్మ పాలెం, తిక్కవాణిపాలెం టి.డి.పీ ఎం.పి.టి.సి అభ్యర్థులు మైలపల్లి ధనలక్ష్మిఅప్పన్న,సూరాడ ఎర్రయ్య, మాజీ ఎం.పి.టి.సి చింతకాయల ఆమ్మోరు, బొంది నూకరాజు, చేపల మసేను, మరియు టి.డి.పి వార్డు మెంబర్లు,ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలును పెందుర్తి శాసన సభ్యులు వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరము చింతకాయల ముత్యాలు మాట్లడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలుకు అకర్శుతులై మీము అంతా వైసిపి తీర్దం పుచ్చుకున్నామన్నారు. మత్స్యకారులు ముఖ్య మంత్రి జగన్ మొహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారు అన్నారు. గ్రామఅభివృద్ధి వైసిపితోనే సాధ్య పడుతుంది అని అన్నారు.పెందుర్తి శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ సారద్యంలో మీము అంతా పని చేయడానికి సిద్దమనీ అన్నారు. పెందుర్తి నియోజకవర్గనికి ఎమ్మెల్యే అధీప్‌రాజ్ చేస్తున్న సేవలు అద్భుత మని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్ , రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ సి.ఈ. సి సభ్యులు పైల శ్రీనివాసరావు,జెడ్.పి.టి.సి అభ్యర్థి పి.ఎస్.రాజు, పెందుర్తి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పైల జూనియర్ అప్పలనాయుడు, కాసు అంజిరెడ్డి, వెన్నెల సన్యాసిరావు ,మండల అగ్రికల్చరల్ సలహా కమిటీ కన్వీనర్ కోన రామారావు, బురద రాజు,కూర్పపు తాతాజీ, కూర్పపు సీతారామయ్య,సోషల్ మీడియా ఇంచార్జి పల్లా గోవింద్,గొర్లి గోపీ,బండి ముత్యాలు,దలాయి రాము తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ యూనివర్సిటీ నిర్వహణ

### సమాధానమిచ్చిన ఇంఛార్జి రిజిస్ట్రార్


విద్యార్థుల సందేహాలకు సమాధానమిస్తున్న ఆచార్య రవీంద్ర బాబు

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వ హించారు. వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్, పీజీ పీరీక్షల డీన్ ఆచార్య జి.వి రవీంద్ర బాబు విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు.

దూరవిద్య పరీక్షలు, మార్కుల జాబితాలు జారీ, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, పీజీ పరీక్షలు లేదీలు, హాస్టల్ వసతి, టి.సి జారీ తదితర అంశాలపై విద్యార్థులు తమ సందేహాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో యూజీ డీన్ ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, దూర విద్య సంచాలకులు పి.హరి ప్రకాష్, డిఓఏ సంచాలకులు ఆచార్య నాయుడు, సిడిసి డీన్ సి.హెచ్ పాండు రంగా రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆదిలక్ష్మి, సుధాకర్ రెడ్డి , డి.ఆర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార వారోత్సవాలు



పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : పౌష్టిక వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం కొయ్యూరు మండలంలో ఆర్.కంఠారం, రేవళ్ల, నిమ్మలపాలెం గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రేవళ్ల మహిళా కార్యదర్శి దుమంతి ఇందిరా, ప్రియాంక మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం అనగా పాలు, గుడ్లు, పప్పు, శెనగ అచ్చులు, బాలామృతం పిండి మొదలైనవి బాలింతలకు, గర్భిణీలకు, పిల్లలకు చూపించి ఇవన్నీ సక్రమంగా అందుతున్నాయో లేదా అని అడిగి తెలుసుకున్నారు. తదుపరి అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే ఈ పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణీలు కూడా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శితో పాటు గ్రామ వాలంటీర్లు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం అమ్మకానికి పాల్పడితే కఠిన చర్యలు

## - ఎస్ఐ జి.లక్ష్మణరావు



అచ్యుతాపురం : అక్రమ మద్యం అమ్మకానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అచ్యుతాపురం ఎస్ఐ జి లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన అచ్యుతాపురం జంక్షన్ లో అక్రమ మద్యం కలిగి ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్బంగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల రవి, పూడిమడక గ్రామానికి చెందిన మేరుగు ముత్యాలును అదుపులోకి తీసుకొని వారివద్ద నుండి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జి లక్ష్మణరావు తెలిపారు. అలాగే సెజ్ కాలినిలో అక్రమ మద్యం కలిగి ఉన్న పప్పు గణేశ్వరరావు ను అదుపులోకి తీసుకొని 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ జి లక్ష్మణరావు తెలిపారు.

# సమరసతసేవా ఫౌండేషన్ మండల సమావేశం



పరవాడ : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ మండలం పరవాడ పంచాయతీ వెన్నెల పాలెం జంక్షన్ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం లో మండలం సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో మండలం కన్వీనర్ చుక్క సన్యాసి రావు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో భజనలు మరియు దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి కార్యక్రమం జరగాలి, ప్రతీ నెలా మండల మరియు ఉపమండల సమావేశాలు జరగాలి, మండల మరియు ఉపమండల సభ్యులు గ్రామం కమిటీ సభ్యులు తో మాట్లాడం జరగాలని నిర్ణయించారు, ఉపమండల కమిటీ సభ్యులు ప్రతీ పంచాయతీ దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి కార్యక్రమం, భజన కార్యక్రమాలు జరిగేవిదంగా బాధ్యత తీసుకోవాలని నిర్ణయించారు, ఎంపిక చేసిన 5 పంచాయతీ గ్రామం లో ధర్మం గూర్చి మాట్లాడం చేయాలి సభ్యులు అందరూన్నీ కోరుతున్నాము. ఈకార్యక్రమంలో మండలం మహిళా కన్వీనర్ రాయవరపు దాలమ్మ, సహకన్వనర్ మల్లి మడుగుల నాగ పేర రాజు, ఉపమండల కన్వీనర్ గొర్లి ఎరికి నాయుడు, వానపల్లి అప్పలరాజు, సహ కన్వనర్ పైలా శ్రీను, ప్రగడ రాజు, రాయవరపు అప్పల నాయుడు, మండలం ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 'నజీర్ కిచెన్ సర్వీస్ సెంటర్' ను ప్రారంభించిన

## వైసీపీ మాజీ యువజన అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు..

## నిరుపేద కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలి



విశాఖపట్నం : నిరుపేద కుటుంబాలకు అందుబాటులో.. ఉండేలా.. పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ దేవస్థానం కూడలిలో. 'నజీర్ కిచెన్ సర్వీస్ సెంటర్' ను వైసీపీ మాజీ యువజన అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకులు విల్లూరి భాస్కరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నిరుపేద కుటుంబాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అన్నారు.. గ్యాస్ స్టవ్ లు, మిక్సీలు, ఇతర కిచెన్ పరికరాలు మరమ్మత్తులకు గురైతే.. తక్కువ మొత్తంతోనే వాటికి మరమ్మతులు చేయించుకోవచ్చన్నారు.. ఇది పేదలకు అందు బాటులో ఉండే సర్వీస్ సెంటర్ అని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిరుపేద కుటుంబాలకు అందుబాటులో ఉండే విధంగా సర్వీస్ సెంటర్ ప్రారంభించిన నజీర్ జహంగీర్ ప్రత్యేకంగా అభినందించారు.

# ముఖ్యమంత్రి ఫొటోకు పాలాభిషేకం



గొలుగొండ : గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రెండు దశాబ్దాలుగా ప్రమోషన్స్ కోసం పోరాడుతున్న ఎంపిడిఒలు, పంచాయతీ రాజ్ సిబ్బందికి చక్కని కానుకగా డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టులు కొత్తగా క్రియేట్ చేసి ప్రమోషన్స్ అత్యంత తక్కువ సమయంలోనే పొందే అవకాశాన్ని కల్పించినందుకు మీకు సదా రుణపడి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి లాలం సీతయ్య, గొలుగొండ గ్రామపంచాయతీ కార్యదర్శి రఘురాం, మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రత్నం, గొలుగొండ సచివాలయ స్టాఫ్, ఆఫీస్ సబార్డినేట్లు డేవిడ్, హరీష్, కంప్యూటర్ ఆపరేటర్ శంకర్, గ్రీన్ గార్డ్ సత్తిబాబు పాల్గొన్నారు.

## కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో

# బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలి

## ధరణి, ఇంటి పనివారల సంఘాల డిమాండ్



విశాఖపట్నం : కోవిడ్-19 లాక్డౌన్ వల్ల నష్టపోయిన వలస కూలీల కుటుంబాలతో పాటు వ్యభిచారం లో ఉన్న సెక్స వర్కర్‌లకు, అక్రమ రవాణా నుండి బయటపడిన కుటుంబసభ్యులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి డిమాండ్ చేశారు. కరోనా లాక్డౌన్ బాధిత కుటుంబాలకు నేరుగా ప్రతి నెలకు రూ6000 చొప్పున ప్రత్యక్ష నగదు సహాయం అందజేయాలని కోరారు.ఈ డిమాండ్ల మేరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ ఎన్జీవోలు ఈ నెల17 నుంచి లక్ష సంతకాల సేకరణ కార్యక్రమ చేపట్టినట్టు చెప్పారు.ధరణి సంస్థ కూడా సంతకాల సేకరణ,ప్రచార కార్యక్రంలో పాల్గొని సంతకాల సేకరణ లో పాలు పంచుకుంటున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలో పలు ప్రాంతాలలో సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఉషోదయ జంక్షన్, ఆదర్శనగర్, ఎం.వి, పి కాలనీ లలో, తదితర ప్రాంతాలలో సంతకాల సేకరణ,ప్రచార కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో కోట్లాది మంది వలస కార్మికులు ,అసంఘిటితరంగ కార్మికులు, ఇంటి పని వారలు కరోనా లాక్డౌన్ వల్ల జీవనోపాధి కోల్పోయారని తెలిపారు.వీధివిక్రేతలు,స్వయం ఉపాధి పొందు తున్నవారు సరైన ఉపాధి లేక భయంకరమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి పి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ,ఇంటి పని వారలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్లను సమస్యలను ప్రదర్శించారు.

# గురువే దైవం ... టీచర్స్ డే గొప్పతనం



అజ్ఞానమనే చీకటి లో ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపే వారే ఉపాధ్యాయులు. గురువు అనుగ్రహం కలిగిన నాడు అజ్ఞాని కూడా జ్ఞానవంతుడు అవుతాడు. ప్రతి ఏటా సెప్టెంబర్ 5వ తేదీన మన జీవితాల్లో వెలుగులు నింపుతున్న టీచర్లను స్మరించుకుంటూ టీచర్స్ డే జరుపుకుంటున్నాము . ప్రపంచ వ్యాప్తంగా టీచర్స్ డే ను అక్టోబర్ 5న జరుపుకుంటే భారతదేశంలో మాత్రం సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించుకోవడం జరుగుతుంది . భారతదేశంలో సెప్టెంబరు 5 టీచర్స్ డే వేడుకలు జరుపుకోవడానికి వెనుక ఎన్నో కారణాలున్నాయి. సెప్టెంబర్ 5న టీచర్స్ డే ...ప్రతి ఏటా స్కూళ్ళు , కాలేజీల్లో వేడుకలు 1962 వ సంవత్సరం నుండి సెప్టెంబర్ 5వ తేదీన ప్రతి ఏడాది డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ఆరోజు మనకు విద్యా బోధన చేసిన గురువులను స్మరించుకుంటాము. మన భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన, మనం ఉన్నతంగా ఎదగడానికి తోడ్పాటు నందించిన గురువులను గుర్తు చేసుకొంటాము. వారిని పూజిస్తాము. గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః అంటూ గురువులను స్మరించటమే కాకుండా టీచర్స్ పై ఉన్న భక్తి ప్రస్ఫుటం అయ్యేలా పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుంటాం. ఇక పాఠశాలలు, కళాశాలలలో సందడే సందడి.

భారత రాష్ట్రపతిగా పని చేసిన డాక్టర్ . సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప గురువు అసలు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజునే ఎందుకు టీచర్స్ డే గా జరుపుకుంటాము అన్నది చాలా మంది మనసులోని ప్రశ్న . ఇక దానికి జవాబు ఈ కథనంతో అర్థం అవుతుంది. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా పని చేశారు. 1988లో తిరుత్తణిలో ఆయన జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీ లో మాస్టర్ డిగ్రీ చదువుకున్నారు. కలకత్తా, మైసూర్ యూనివర్సిటీ లలో ఆయన లెక్చరర్ గా పనిచేశారు. చాలా మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు.

తన పుట్టిన రోజు వేడుకలు వద్దన్న గురువు ... అందుకే ఇలా ... ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏ రోజు తన పుట్టినరోజును జరుపుకోవాలని కోరుకోలేదట. విద్యార్థులు ఎవరైనా పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తామని ఆయనని అడిగితే వద్దని వారించే వారట. విద్యార్థులు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పేవారట. అందుకే ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే వేడుకలను జరుపుతున్నారు. అది అప్పటి నుండి ఇప్పటి వరకు ఆనవాయితీగా వస్తుంది.

మహర్షి , గొప్ప గురువు సర్వేపల్లి గురించి మహనీయుల అభిప్రాయాలు భారతదేశంలో ఆనాడు ఉన్న మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్విక స్థాయికి తీసుకువెళ్ళిన గొప్ప పండితులు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతి కి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరూ గురువులకే గురువు గా భావించేవారు. సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మాగాంధీ కీర్తించారు. యుగ పురుషుల గురించి ఉపన్యాసం ఇవ్వండి అని పిలిస్తే యుగపురుషుడే వచ్చారు అని సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉద్దేశించి కీర్తించారు హెవెల్. నాలో మామూలు మనిషిని దర్శించిన మహర్షి అంటూ సోవియట్ అధినేత స్టాలిన్ ఆయన గొప్పతనాన్ని చెప్పారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజునే టీచర్స్ డే గా మీరు నా కృష్ణుడు నేను మీ అర్జునుడిని అని గాంధీజీ మాటలను బట్టి ఆయన ఒక గీతాచార్యుడు గా కీర్తించబడ్డారు. అన్నిటికంటే



ఆయన గొప్ప ఉపాధ్యాయుడు. ఎంతోమంది విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దిన గొప్ప గురువు. ప్రతి ఒక్కరూ ఆయనలాగా విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే , ఆయనను స్మరిస్తూ, ఆయన మార్గంలో పయనించాలని దిశానిర్దేశం చేస్తూ ఆయన పుట్టిన రోజును టీచర్స్ డే గా జరపాలని నిర్ణయం తీసుకుంది కేంద్రం . పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తీసుకున్న ఈ నిర్ణయానికి సర్వేపల్లి గొప్పతనమే కారణం . గాంధీ, హెవెల్ వంటి మహనీయులు కూడా ఆయనను గురువులకే గురువుగా గుర్తించటం కారణం .

గురువుల బాధ్యత గుర్తు చేస్తూ , విజ్ఞాన జ్యోతిని వెలిగించిన గురువులను స్మరిస్తూ ఏ రంగంలో అయినా, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఎవరైనా సరే ఉపాధ్యాయుల వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న వారే. గురువులు అందించిన విజ్ఞానంతో, సంస్కార సౌజన్యాలతో పైకి ఎదిగిన వారే. పిల్లల బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయుడిదే కీలకపాత్ర . ఇంతటి మహత్తర కార్యాన్ని నిర్వర్తించే గురువు కలకాలం తలెత్తుకు జీవించవచ్చు. ఇంత గొప్ప గొప్ప అవకాశం మరెవ్వరికీ దక్కదని రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహానుభావులు చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి అంత గొప్పది, ఉపాధ్యాయులు అంతటి గొప్ప వారు. కాబట్టి టీచర్స్ డే విద్యార్థులకు ఒక పండుగ రోజు. గురువులకు గురుతరమైన బాధ్యతను గుర్తు చేసే రోజు. గొప్ప గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు .

## పప్పుశెట్టిపాలెంలో పంచాయతీలో

# రెండు కరోనా కేసులు



కంటైన్‌మెంట్ జోన్ ఏర్పాటు చేసిన దృశ్యం

గొలుగొండ : మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జమ్మదేవిపేట గ్రామంలో 1, పప్పుశెట్టిపాలెం గ్రామంలో 1 కేసులు నమోదయ్యాయని పంచాయతీ అధికారులు తెలిపారు. కేసులు నమోదు కావడంతో వెంటనే స్పందించిన పంచాయతీ అధికారి సందీప్, రెవెన్యూ అధికారి పడాల్, గ్రామంలో పర్యటించి కంటోన్మెంట్ జోన్లు ఏర్పాటు చేసి బ్లీచింగ్ స్ప్రేయింగ్ చేయించారు.

# పాస్టర్లుకు నిత్యావసర సరుకులు పంపిణీ



దేవరాపల్లి : కోవిడ్-19 విపత్తు సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్న పేద గిరిజనలకు, ఆ ప్రాంతాలలో ఉన్న కొంతమంది పాస్టర్ల కు నిస్సి గాస్పల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గొర్లె టైటస్, గ్రేస్ దంపతులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాస్టర్ల కు నిత్యావసర సరుకులు బియ్యం, కందిపప్పు, పంచదార, టీ పొడి, టూత్ పేస్ట్, సేమియా ఉప్మా నూక, గోధుమ పిండి, గుడ్లు, కొబ్బరి నూనె, పచ్చడి, సోప్స్, షాంపూలు,బ్రేస్లు డాక్టర్ గొర్లె టైటస్, గ్రేస్ టైటస్ దంపతులు పాస్టర్ల కు అందజేశారు.

# మహిళకు వందనం

**- కరోనా నేపథ్యంలో సేవలు ప్రశంసనీయం**
**- ఇల్లాలిగా అమోఘమైన సేవలు**

విశాఖపట్నం: కరోనా వైరస్ విజృంభిస్తున్న వేళ మహిళల పాత్ర మరింత కఠినమైంది. ఇంటా బయటా ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. మానసిక ఒత్తిడి...పని భారం పెరిగి కొన్ని సందర్భాల్లో అస్థిత్వాన్ని కోల్పోతున్నారు. అంతలోనే మళ్లీ ఓపికను, సహనాన్ని కూడగట్టుకుని సర్దుకుపోదాం అన్న దృక్పథంతో ఇంటిని సరిదిద్దుకుపోతున్నారు. లాక్ డౌన్ సమయంలో గృహిణిగా మహిళ తమ కుటుంబ సభ్యులకు అందించిన సేవలు అన్నీ ఇన్నీ కావు. పేద, సామాన్య కుటుంబాల్లో వనిత చూపిన ఓర్పు వర్ణనాతీతం. 'కరోనా'తో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా కకావికల మయ్యాయి. చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. స్వయం ఉపాధితో జీవితం సాగిస్తున్న వారి పరిస్థితి దుర్భరమైంది. చేతివృత్తుల వారికి చేతినిండా పని లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పేద కుటుంబాల్లో పూట గడవడమే కష్టమవుతోంది. సామాన్యులు కూడా సౌకర్యవంతంగా జీవితాన్ని సాగించలేకపోతున్నారు. కొందరు తమ వద్ద ఉన్న నగలు తాకట్టు పెట్టి వచ్చిన రుణంతో రోజువారీ జీవితాన్ని సాగిస్తున్నారు. లాక్ డౌన్ పూర్తయి అన్లాక్ ప్రారంభమైన నేపథ్యంలో క్రమేపీ సడలింపులు ఇస్తున్నా సగటు మనిషి జీవితాలు మాత్రం గాడిన పడడం లేదు. ఈ పరిస్థితిలో ఓర్పు... నేర్పుతో ఇల్లాలు ఇంటిల్లపాదిని సంతృప్తి పరచడానికి చేస్తున్న ప్రయత్నం స్త్రీ శక్తికి నిదర్శనం.

**గృహిణిగా:** కరోనా నేపథ్యంలో గృహిణిగా మహిళ తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నట్టు వెల్లడవుతున్న వాస్తవాలను బట్టి అర్థమవుతుంది. పేద సామాన్య కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతుండడంతో గృహిణి పాత్ర అగ్ని పరీక్షలా మారింది. భర్తకు ఉద్యోగం పోవడమో... ఒకవేళ ఉద్యోగం వున్నా సరిగ్గా జీతం అందకపోవడమో వంటి పరిస్థితులు కుంగదీస్తున్నాయి. లాక్ డౌన్ కారణంగా నష్టపోయి కొన్ని సంస్థలు ఉద్యోగులను తగ్గిస్తుంటే మరికొన్ని సంస్థలు నష్టాలు లేకపోయినా కరోనా పరిస్థితులను సాకుగా చూపి పెద్ద సంఖ్యలో ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయి. ఈ దుర్భర పరిస్థితుల్లో ఇంటి యజమానికి ఉద్యోగం లేకపోవడంతో కొందరు మహిళలు బయట ఇళ్లల్లో ఇంటి పని, వంట పని చేయడానికి సిద్ధపడుతున్నారు. ఓ పక్క బయట ఇళ్లల్లో పని చేస్తూ... మరోపక్క తన ఇంటిలో పనులు చేసుకోవడం కష్టంగా మారుతోంది. ఆ న్నదాంట్లోనే వండి పెట్టి కుటుంబ సభ్యుల ఆలనా..పాలనా చూసుకోవడం కరోనా నేపథ్యంలో మహిళలకు కత్తి మీద సాములా మారింది. ప్రభుత్వం అందించిన రేషన్ సరుకులతో నెలంతా గడపడం కష్టంగా మారుతోంది. యజమానికి మద్యం సేవించే అలవాటు వుంటే ఆ కుటుంబం మరింత చిన్నాభిన్నం అవుతోంది. చేతికందిన మొత్తంలో సగానికి పైగా మద్యానికే ఖర్చు పెడుతున్న వారు కూడా వున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గృహిణిగా మహిళ పడుతున్న శ్రమ కలచివేయక మానదు. ఇంట్లో పిల్లలు, వృద్ధుల భారం మహిళలపైనే పడుతోంది.

**ఉద్యో గిగా:** ఇంట్లో భర్తతో పాటు భార్య కూడా ఉద్యోగం చేస్తూ జీవనాన్ని సజావుగా సాగిస్తున్న కుటుంబాలపై కూడా కరోనా ప్రభావం పడింది. దాదాపు అన్ని రంగాలు కరోనా వల్ల అస్తవ్యస్తమైన పరిస్థితుల్లో కొందరు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. వీరిలో మహిళల సంఖ్య కూడా ఎక్కువగానే వుంది. కొన్ని ప్రైవేటు సంస్థల్లో పరిస్థితి మరీ దారుణం. ఒకవేళ ఉద్యోగం వున్నా గతంలో ఇచ్చిన జీతాన్ని బాగా తగ్గించి పనిభారాన్ని పెంచుతున్నారు. దీంతో ఆర్థిక అవసరాలు తీరకపోగా పని ఒత్తిడి పెరుగుతోంది. మరోపక్క ఇంట్లో పనులు చేసుకోవడంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఆన్లైన్ ద్వారా విధులు నిర్వహిస్తున్న మహిళలు కూడా గతం కంటే పని భారాన్ని పెంచారని చెబుతున్నారు. ఉద్యోగ రీత్యా విధి నిర్వహణ చేస్తూనే కుటుంబ పరిస్థితులను చక్కదిద్దుకోవడంలో మహిళల పాత్ర మరింత కీలకంగా మారింది. చుట్టుముడు తున్నాయి.

కరోనా వైద్య సేవల్లో మహిళల పాత్ర కీలకం కరోనా సోకిన వారికి వైద్య సేవలు అందించడంలో మహిళల పాత్ర కీలకంగానే వుంది. ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, నర్సులు విశేషమైన సేవలందిస్తున్నారు. కాగా పారిశు ధ్య పనులు నిర్వహిస్తున్న వారిలో కూడా మహిళలే అధికంగా వుంటున్నారు. ఈ కరోనా కాలంలో దాదాపు 70 శాతం మంది పురుషులకు వైద్య సేవలందించడంలో మహిళలు బాధ్యతగా వ్యవహరించారని చెబుతున్నారు. కరోనా సంక్షోభం ప్రారంభం నుండి నేటివరకు 30 లక్షలకు పైగా కరోనా కేసులు నమోదయ్యా యి. 75 శాతానికి పైబడి రికవరీ రేటు ఇంకా 23 శాతం యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా కేసుల నమోదులో మహిళల కంటే పురుషులే అధిక శాతం ఉన్నారు. అయితే పురుషులకు సేవలందిస్తున్న వారిలో మహిళలు అధికంగా వుంటూ ఎంతో బాధ్యతతో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందిస్తున్నారు.

**కొనసాగుతున్న వేధింపులు** : కరోనా నేపథ్యంలో లాక్ డౌన్, ఆ తరువాత కూడా మహిళలపై గృహహింస పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. అలాగే అవమానాలు, అసమానతలు, మహిళల సమస్యలను మరింత జటిలం చేస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన ఓ సర్వే ప్రకారం ఇప్పటికి 41 శాతం మంది పురుషులకు భోజనం సక్రమంగా సిద్ధం చేయడంలో విఫలమైతే మహిళలపై చేయి చేసుకునే వైనం కొనసాగుతోందని తేలింది. ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తున్న మహిళలపై ఇప్పటికీ వేధింపులు కొనసాగుతూనే వున్నాయి. ఇండియన్ నేషనల్ క్రైమ్ రీసెర్చ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల అందించిన నివేదికల ప్రకారం ప్రతి 4.4 నిమిషాలకు దేశంలో ఓ మహిళ గృహహింసకు గురవుతున్నట్టు తెలిసింది. ప్రతి ముగ్గురి మహిళల్లో ఒకరు వారి జీవితకాలంలో సన్నిహిత భాగస్వామి నుంచి హింస అనుభవిస్తున్నారన్న క్రైమ్ ఇన్ ఇండియా నివేదిక సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది. అలాగే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్ హెచ్ఎస్) ప్రకారం గృహహింసకు గురవుతున్న మహిళలు ఒక్క శాతానికి మించి సహాయం కోసం బయటకు రావడం లేదనే విషయాన్ని గుర్తించారు. దేశంలో శాస్త్ర సాంకేతికత ఎంత పెరిగినా ఇప్పటికీ హెల్ప్ లైన్లు, అనేక యాప్లు మహిళలకు అందుబాటులో లేవు. కేవలం 29 శాతం మందికి మాత్రమే ఇంటర్నెట్‌ంటి సదుపాయాలు అందుబాటులో వున్నా సగం మంది కూడా వినియోగించలేని పరిస్థితులు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఫలాలు కూడా మహిళలకు అందకపోవడం కూడా వారి వెనుకబాటుకు ఒక కారణంగా కనబడుతోంది. ఎన్ఎస్ఎస్ కార్యాలయం గతేడాది లెక్కల ప్రకారం ప్రపంచంలో ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో అతి తక్కువ మహిళా కార్మిక భాగస్వామ్యం కలిగి వుందని తేలింది. కరోనా నేపథ్యంలో మహిళలు ఆర్థికంగా కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహిళల సారథ్యంలో దేశంలో నడపబడుతున్న అనేక సంస్థలు ఆర్థికవ్యవస్థను పటిష్టం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. అయితే కరోనా ప్రభావంతో ఆయా సంస్థలు కూడా డీలా పడ్డాయి. భారీ సంస్థల నుంచి చిన్న చిన్న సంస్థలు కూడా తిరోగమనం వైపు పయనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న చేయూత, ఉద్దీపనలు నినాదాలకే పరిమితం కావడం చిన్న చిన్న సంస్థలను నడుపుతున్న మహిళలకు నిరాశను కలిగిస్తున్నాయి. మహిళల అవకాశాలను, హక్కులను కరోనా దెబ్బతీసింది. పొదుపునకు అవకాశం లేని మహిళలు మరింత పేదరికానికి లోనయ్యే దయనీయ పరిస్థితి నెలకొంది. గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు ఉపాధి హామీ పనుల్లో

భాగస్వాములవుతున్నారు. ఎంతో కష్టపడి పని చేసిన వీరికి ఇంటి దగ్గర పనులు కూడా తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళలను ఆదుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

**ఆరోగ్య సమస్యలతో సతమతం:** కరోనా నేపథ్యంలో సహజంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నా వైద్యుల వద్దకు వెళ్లలేకపోతున్నారు. స్థానికంగా వున్న మెడికల్ షాపుల్లో మందులను తీసుకుని వాడుతున్నారు. ఒక్కోసారి ఆరోగ్యం విషమించి చేయి దాటిపోయే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయి. కరోనా రోగులకు సేవలందిస్తున్న మహిళలు తమకు ఆరోగ్య సమస్యలున్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది.

లా డౌన్ సందర్భంలో శృంగార జీవితానికి అవకాశం ఏర్పడిన నేపథ్యంలో కొందరు మహిళలు గర్భనిరోధక మాత్రలు వాటి వాటి ప్రభావంతో ఇబ్బంది పడ్డారని చెబుతున్నారు. కాగా లాక్ డౌన్ తో గర్భ నిరోధక మాత్రలు దొరక్క . ఒకవేళ దొరికినా.. కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితి లేక అవాంఛనీయ గర్భంతో అయిష్టంగానే సంతానోత్పత్తికి దారితీసే పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు.

## డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి



అన్నవరం : తూ.గో.జిల్లా... అన్నవరం గ్రామంలో కొత్తపేటలో గౌరీ కళ్యాణ మండపం వద్ద AP 05EQ B 045 గల బైక్ డివైడర్ ను ఢీకొని తొండంగి మండలం శృంగ వృక్షం గ్రామానికి చెందిన దమ్ము అప్పారావు, తండ్రి రవణ, వయసు 23 సం..లు తలకి బలమైన గాయం తగలడంతో అక్కడి అక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టంకి ప్రత్తిపాడు తరలిస్తున్నామని అన్నవరం పోలీసు ఎస్ఐ వీరబ్బాయి తెలిపారు.

**ఆక్రమణకు గురైన**
## రూ.100కోట్ల ప్రభుత్వ ఆస్తిని
**తక్షణమే స్వాధీనం చేసుకోండి - సీపీఐ**

విశాఖపట్నం : మధురవాడ సర్వే నెం 367 లో గల సుమారు 100 కోట్ల విలువైన 9.27 ఏకరముల ప్రభుత్వ భూమిలో దర్జాగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిచిన ఆక్రమణ దారులను తక్షణమే చట్టప్రకారం కఠినంగా శిక్షించి,ఆభవనాలు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కలెక్టర్ ని విజ్ఞప్తి చేసింది. సీపీఐ విశాఖ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు శుక్రవారం జిల్లా కలెక్టర్ కి మెయిల్ ద్వారా పంపిన వినతిపత్రం లో 2016 ఆగష్టు నెలలో ఈభూమి అన్యాక్రాంతం జరిగిన అంశం గుర్తించి సీపీఐ తరుపున అప్పటి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ ప్రకాష్‌కి పిర్యాదు చేశామని వెంటనే విచారణ జరిపించి అభూమి ప్రభుత్వ భూమని రెవిన్యూ రికార్డులను మార్చి, అందులో నిర్మిస్తున్న భవనాలు అక్రమంగా నిర్మిస్తున్న వేననితేల్చి,ఆ భవనాలు నిర్మాణానికి ఇచ్చిన అన్ని అనుమతులు రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేసి నాలుగు సం"గడిచినప్పటికి నేటికి అవి కార్యరూపం దాల్చకపోవడం అవినీతే అసలు కారణమని...

ఇటువంటి అంశములు వెలుగులోకి రాగానే అధికారులు కొద్దిగా హడావుడి చేసి వదిలివేయడం, గడిచిన నాలుగు సం" ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడానికి కారణాలపై కూడా సమగ్రమైన విచారణ జరిపించాలని...

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నం లో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటుచేస్తున్న తరుణంలో తక్షణమే ఆ విలువైన ప్రజా ఆస్థిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ,ప్రజా అవసరాలకు వినియోగించు కోవాలని సీపీఐ తరుపున కోరుతున్నాము.

## జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఈబి దాడులు

- స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీ ఎన్.శ్రీదేవీరావు



విజయనగరం : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటుబ్యూరో ఆధ్వ ర్యంలో జిల్లాలో గుర్ల, కొత్తవలస, సీతానగరం పోలీసు స్టేషన్ల పరిధిలలో దాడులు నిర్వహించి 60 టన్నుల ఇసుక అక్రమ నిల్వలు, 40 క్వార్టరు బాటిల్లు మద్యం, 200 నాటుసారా పాకెట్లు పట్టుకొన్నట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు శుక్రవారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజ కుమారి ఆదేశాలతో ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఎస్.ఈ.బి సిబ్బందితో దాడులు నిర్వహించినట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు.

గుర్ల పి.ఎస్ పరిధిలో, కలవచర్ల గ్రామ శివార్లలో 60 టన్నుల అసుక అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకొని, ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. కొత్తవలస పి.ఎస్ పరిధిలో అక్రమ మద్యం పై దాడులు నిర్వహించి, 40 క్వార్టరు బాటిల్లు మద్యం స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపు లోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు.

సీతానగరం పి.ఎస్ పరిధిలో నాటుసారా పై దాడులు నిర్వహించి, 200 నాటుసారా పాకెట్లు, ఒక మోటారు సైకిలు స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. ఈ దాడుల్లో ఎస్ఈబి అధి కారులు, సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది మరియు స్థానిక పోలీసులు పాల్గన్నారని ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు.

## 3నెలల్లో ఒకేఒక్క కరోనా మరణం!

**వైరస్ నియంత్రణలో న్యూజిలాండ్ విజయం**



వెల్లింగ్టన్: కరోనావైరస్ మహమ్మారి ధాటికి ప్రపంచదేశాలు వణికిపోతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో కేసులు, వందల మరణాలు సంభవిస్తుండడంతో ఆయా దేశాల్లో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో వైరస్ తీవ్రతను అదుపుచేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మహమ్మారిని నియంత్రించడంలో న్యూజిలాండ్ విజయం సాధించిందనే చెప్పవచ్చు. గడిచిన మూడు నెలల్లో ఇక్కడ కేవలం ఒకేఒక్క కరోనా మరణం నమోదయ్యింది. మే 24 తర్వాత తాజాగా మరో కొవిడ్ మరణం చోటుచేసుకుంది. దీంతో దేశంలో ఇప్పటివరకు కరోనా మరణాల సంఖ్య 23కుచేరింది. ప్రపంచదేశాలను వణికిస్తున్నప్పటికీ న్యూజిలాండ్‌లో వైరస్ తీవ్రత తక్కువగానే ఉంది. సమీప దేశమైన ఆస్ట్రేలియాలోనూ పలుచోట్ల వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. విదేశీ ప్రయాణాలు లేకపోవడం, కాంటాక్ట్ ట్రేసింగ్ వంటి చర్యలతో దేశంలో కరోనా వైరస్ తీవ్రత అదుపులోనే ఉంది. అయితే, గతనెలలో ఆక్లాండ్‌లో తిరిగి వైరస్ బయటపడింది. దీన్ని నియంత్రించేందుకు అక్కడ రెండు వారాలకుపైగా లాక్‌డౌన్ విధించారు. తాజాగా లాక్‌డౌన్ కాలం ముగుస్తున్న సమయంలోనే యాభై ఏళ్ల వ్యక్తి కొవిడ్ సోకి మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ కొవిడ్ అప్రమత్తత లెవల్-2.5గా నిర్ధారించిన అధికారులు, పది మంది కంటే ఎక్కువగా ప్రజలు సమూహాలుగా ఏర్పడవద్దని సూచించారు. దాదాపు 102 రోజుల తర్వాత నగరంలో పాజిటివ్ కేసు బయటపడినట్లు అధికారులు తెలిపారు. అయితే, దేశవ్యాప్తంగా సెప్టెంబర్ రెండోవారం వరకు కొవిడ్ నియంత్రణ ఆంక్షలు కొనసాగుతాయని ప్రధానమంత్రి జెసిండా ఆర్డెర్న్ స్పష్టంచేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొవిడ్ అప్రమత్తత లెవల్-2 గా ప్రకటించారు.

దీని ద్వారా ప్రతిఒక్కరు భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించడం తప్పనిసరి. వంద మంది కంటే ఎక్కువ మంది సమూహాలుగా ఏర్పడకూడదు. ఇదిలాఉంటే, జాన్స్‌హాప్కిన్స్ యూనివర్సిటీ నివేదిక ప్రకారం, న్యూజిలాండ్‌లో ఇప్పటివరకు 1764 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో ప్రస్తుతం 112కేసులు మాత్రమే యాక్టివ్ ఉన్నట్లు అక్కడి వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే అత్యంత కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ వైరస్ ఎలా వ్యాప్తి చెందిందనే విషయం మిస్టరీగా ఉన్నట్లు అక్కడి అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## రియా చక్రవర్తి ఇంట్లో ఎన్‌సీబీ సోదాలు

***కీలక ఆధారాలు సేకరించే పనిలో మాదకద్రవ్యాల నియంత్రణ బ్యూరో***





ముంబయి: నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పూత్‌కు మాదకద్రవ్యాలు సరఫరా చేసేదంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న నటి రియా చక్రవర్తి ఇంట్లో మాదకద్రవ్యాల నియంత్రణ బ్యూరో (ఎన్‌సీబీ) సోదాలు చేపట్టింది. డ్రగ్ డీలర్ జైద్ విలాత్రకు రియాతోపాటు ఆమె తమ్ముడు షోవిక్‌కు సంబంధాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలోనే శుక్రవారం ఉదయం ముంబయిలోని నటి ఇంటికి చేరుకున్న ఎన్‌సీబీ బృందం ఆకస్మిక సోదాలు చేపడుతోంది. అంతకుముందు సుశాంత్ సహాయకుడి ఇంట్లో సోదాలు చేపట్టింది. తదుపరి విచారణ కోసం అతడిని ఏజెన్సీ కార్యాలయానికి తీసుకెళ్లింది. డ్రగ్ డీలర్ విలాత్ర మత్తుమందును షోవిక్‌తోపాటు సుశాంత్ మేనేజర్ సామ్యూల్ మిరిండాకి సరఫరా చేసేవాడని అధికారులు గతంలోనే తేల్చారు. మత్తుమందు సరఫరా కేసులో ఎన్‌సీబీ ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేసింది.

జూన్ 14వ తేదీన సుశాంత్‌సింగ్ ముంబయిలోని తన ఫ్లాట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. పలు నాటకీయ పరిణామాల అనంతరం ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడి ప్రియురాలు రియా చక్రవర్తిని సీబీఐ నాలుగు రోజులపాటు విచారించింది. ఆమె సోదరుడు షోవిక్‌తోపాటు పలువురిని ప్రశ్నించి, కీలక ఆధారాలు కేసరించింది. ఈ విచారణలోనే డ్రగ్స్ వాడకం బయటపడింది.

## ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవు : -ఎస్పీ రాజకుమారి

విజయనగరం : విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి, ఐపిఎస్ విజయనరగరం మరియు బబ్బిలి సబ్ డివిజను పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వేరు వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ - తీవ్రమైన నేరాల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని, సాక్షుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని, కేసుల్లో సాక్ష్యాలుగా ఉపయోగపడే వస్తువులను సేకరించి, పరీక్షల నిమిత్తం ఆర్ఎఫ్ఎల్‌కు పంపి, నివేదికలను త్వరితగతిన పొంది, కోర్టుల్లో అభియోగ పత్రాలను నిర్ధిష్ట సమయాల్లోగా దాఖలు చేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దురుసుగా ప్రవర్తించినా, దాడులకు పాల్పడినా, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఫిర్యాదుదారులు, ఎస్సీ మరియు ఎస్టీలతో ఏవిధంగా మెలగాలి, ఎలా ప్రవర్తించాలన్న విషయాలపై జిల్లాలో పని చేసే పోలీసు అధికారులు, సిబ్బంది శిక్షణ పొందే విధంగా ఓరియంటేషను శిక్షణ తరగతులను నిర్వహించాల్సిందిగా పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అవినీతి ఆరోపణలు వస్తే ఉపేక్షించబోమన్నారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదైన తీవ్రమైన, ప్రత్యేక తీవ్రమైన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టా లన్నారు. తీవ్రమైన నేరాల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, సకాలంలో అభియోగ పత్రా లను దాఖలు చేయాలన్నారు. తీవ్రమైన కేసుల్లో దర్యాప్తు చేయుటలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని



పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పెండింగులో ఉన్న డిపిఓ రిఫరెన్సులను, పిటీషన్లును త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్ధిష్ట కాలంలోనే నివేదికలను పంపాలన్నారు. అనంతరం, గత మాసంలో నమోదైన కేసులను, దర్యాప్తులో ఉన్న కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తును పర్యవేక్షించి, సంబంధిత అధికారులకు దర్యాప్తు పూర్తిచేసేందుకు జిల్లాఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి దిశానిర్దేశం చేసారు. ఈ సమీక్షా సమావేశంలో విజయనగరం డిఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సి మరియు ఎస్టి సెల్ డిఎస్పీ బి.మోహనరావు, స్పెషల్ బ్రాంచి డిఎస్పీ వి.వి.అప్పారావు, ఎఆర్‌డిఎస్పీ ఎల్.శేషాద్రి పోలీసు అధికారులు పాల్గన్నారు.

# పెద్ద కంపెనీలతో అనుసంధానం ముఖ్యం

### ఫుడ్ ప్రాసెసింగ్‌పై ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సమీక్ష

### నెదర్లాండ్ ప్రభుత్వం, 8 కంపెనీలతో ఏపీ ప్రభుత్వం ఒప్పందాలు

### వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్, టెక్నాలజీపై ప్రభుత్వం దృష్టి



అమరావతి : ఫుడ్ ప్రాసెసింగ్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్‌లో పెద్ద కంపెనీలతో అనుసంధానం చాలా ముఖ్యమని, లేని పక్షంలో మార్కెటింగ్ సమస్యలు ఏర్పడతాయన్నారు. ఇలాంటి అంశాల్లో మహిళా గ్రూపులను ప్రోత్సహించేటప్పుడు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ చాలా ముఖ్యం అన్న ఆయన, దీని కోసం కంపెనీలతో అనుసంధానం చేసిన తర్వాతనే ముందడుగు వేయాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో నైపుణ్యాభివృద్ధి కోసం త్వరలో ఏర్పాటు చేయనున్న కాలేజీల్లో ప్రత్యేక కోర్సులు నిర్వహించాలని నిర్దేశించారు. జిల్లాల్లో నెలకొల్పుతున్న ఇంటిగ్రేటెడ్ ల్యాబుల్లో అంతర్భాగంగా ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు తరచుగా ఇబ్బందులు పడుతున్న 7, 8 ప్రధాన పంటలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ చేయాలని, ఆ ప్రాసెసింగ్ సెంటర్లలో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సీఎం వైఎస్ జగన్ కోరారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఆక్వా రంగం రైతులకూ మేలు జరగాలని, వారి ఉత్పత్తులకు తగిన ధరలు లభించాలని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ శాఖ మంత్రి కె.కన్నబాబు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ ఎమ్వీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యతో పాటు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు

**ఏపీ ప్రభుత్వం ఒప్పందాలు..**

సమీక్షా సమావేశం అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్‌పై నెదర్లాండ్ ప్రభుత్వం, 8 కంపెనీలతో ఏపీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్, టెక్నాలజీపై ప్రభుత్వం దృష్టి సారించింది. అరటి, టమోటా, మామిడి, చీనీ, మిర్చి, కూరగాయలు సహా పలు వ్యవసాయ ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తుల ఫుడ్ ప్రాసెసింగ్‌పై పలు కంపెనీలతో ఏపీ ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలు చేసుకుంది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో నూతన టెక్నాలజీ, కొత్త ఉత్పత్తుల తయారీపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కంపెనీ ప్రతినిధులు వివరించారు. పంట చేతికి వచ్చిన తర్వాత అనుసరించాల్సిన విధానాలు, అందులో టెక్నాలజీ అంశాలను కంపెనీలు వివరించారు.

- అరటికి సంబంధించి ఎన్‌ఆర్‌సీ బనానా తిరుచ్చితో ఒప్పందం జరిగింది. కొత్త మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ప్రమోషన్‌తో పాటు క్వాలిటీ టెస్టింగ్ ల్యాబరేటరీలపై వారు పని చేస్తారు. ఎన్‌ఆర్‌సితో ఒప్పందంపై ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ శివ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సురేష్‌కుమార్ సంతకాలు చేశారు. డ్రై చేసిన అరటి ఉప ఉత్పత్తిని వారు ముఖ్యమంత్రికి చూపించారు. దాని తయారీ విధానంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానంపై సమావేశంలో సమగ్రంగా వివరించారు.

--టమోటా, అరటి ప్రాసెసింగ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనపై బిగ్ బాస్కెట్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కంపెనీ జోనల్ హెడ్ కె.రామచంద్ర కిరణ్ ఆ ఎంఓయూపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అనంతపురంలో ప్రాసెసింగ్ చేస్తున్నామన్న ఆయన, కలెక్షన్ సెంటర్లపై దృష్టి సారిస్తున్నామని వివరించారు. -మామిడి, చీనీ, మిరప వంటి పంటల ప్రాసెసింగ్‌పై ఐటీసీతోనూ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జి.కృష్ణకుమార్ ఆ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. అలాగే లారెన్స్ డేల్ అగ్రో ప్రాసెసింగ్ (లీప్) కంపెనీ సీఈఓ విజయ రాఘవన్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉల్లి ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టనున్నట్టు ఆ కంపెనీ వెల్లడించింది. -ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో అత్యంత కీలకమైన ఇంటీరియర్ ఆర్కిటెక్చర్, డిజైన్, ప్యాకేజింగ్, కంటైనర్ల అంశాలపై నెదర్లాండ్స్ ప్రభుత్వంతో, ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. వీడియో కాన్ఫరెన్స్‌లో న్యూఢిల్లీనుంచి భారత్‌లో నెదర్లాండ్స్ అంబాసిడర్ మార్టెన్ వాన్ డెన్ బెర్గ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెదర్లాండ్స్ ప్రతినిధి శాన్నీ గీర్డినా క్యాంపు కార్యాలయంలో పాల్గొన్నారు.

- రొయ్యలు, చేపల పెంపకంలో టెక్నాలజీ, మార్కెటింగ్ తదితర అంశాలపై ఐఎఫ్‌బీతో ఏపీ ఒప్పందం కుదుర్చుకుంది. రొయ్యలు, చేపలు ఎగుమతి, రిటైల్ మార్కెటింగ్‌పై అంపైర్ కంపెనీతో ఏపీ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏపీ ఫుడ్ కార్పొరేషన్ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు ఆయా ఒప్పందాలపై సంతకాలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశాయ్ ఫ్రూట్స్ కంపెనీ నుంచి అజిత్ దేశాయ్, తిరుచ్చి ఎన్‌ఆర్‌సీబీ నుంచి డాక్టర్ ఉమ పాల్గొన్నారు.

## గురువులను పూజించే గొప్ప సంస్కృతి మనది

**- ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సీఎం కృష్ణదాస్**

శ్రీకాకుళం : అసామాన్య ఉపాధ్యాయుడు, మార్గదర్శ కుడు, భారత పూర్వ రాష్ట్ర పతి, డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ 'ఉపాధ్యాయ దినోత్సవ' శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెం బర్ 5వ తేదీన సర్వేపల్లి జయంతి సందర్భం గా భారతదేశం యావత్తు అతనికి నివాళులు అర్పించడం ఉపాధ్యాయ సమూహానికి దక్కిన గొప్ప గౌరవమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జాతి నిర్మాణంలో పునరం కితం అవుతున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు మన దేశానికి పెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. గురువులను పూజించే గొప్ప సంస్కృతి మన దేశంలోనే ఉన్నదని, యువతను తీర్చిదిద్దడంలో వారి కృషిని వెలకట్టలేమని కృష్ణదాస్ పేర్కొన్నారు.



## అక్టోబర్ 17 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు

విజయవాడ: అక్టోబర్ 17 నుంచి ఇంద్రకీలాద్రి పై శ్రీ శార్వరి నామ సంవత్సర దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 9 రోజుల పాటు పది అలంకారాలలో దుర్గమ్మ దర్శనమిస్తారు. కోవిడ్ నేపథ్యంలో టైం స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే దసరాలో అమ్మవారి దర్శనానికి అనుమతించే అవకాశం ఉంది. రోజుకు 9 వేలా లేక సంఖ్య పెంచాలా అన్న దానిపై అధికారుల తర్జనబర్జనలో ఉన్నారు. గత ఏడాది దసరాలో రోజుకు లక్షపైనే అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. ఈ ఏడాది కోవిడ్ దృష్ట్యా దుర్గగుడి అధికారులు ఆంక్షలను మరింత కఠినతరం చేయనున్నారు. అమ్మవారి అలంకార వివరాలు : అక్టోబర్ 17వ తేదీన తొలిరోజు శ్రీ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి 18 న శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి

19న శ్రీ గాయత్రీ దేవి, 20న శ్రీ అన్నపూర్ణాదేవి 21 మూలానక్షత్రం రోజున శ్రీ సరస్వతీ దేవి, 22 న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి 23 న శ్రీ మహాలక్ష్మీ దేవి, 24న శ్రీ దుర్గాదేవి, శ్రీ మహిషా సురమర్ధనీ దేవిగా రెండు అలంకారాలలో దుర్గమ్మ దర్శనమివ్వనున్నారు. 25 న శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అదే రోజు సాయంత్రం కృష్ణానదిలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవం నిర్వహిచారు. దీంతో దసరా ఉత్సవాలు ముగుస్తాయి.

# నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యత పాటించాలి..

**- పెదబయలు మండలంలో సుడిగాలి పర్యటన - గ్రామ సచివాయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల పరిశీలన**

**- మన్యంలో పది కాలాలు వుండేలా పనులు చేయాలి**

**జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్**



పెదబయలు : ఏజెన్సీలో చేపట్టిన నిర్మాణ పనులలో పటిష్టమైన నాణ్యత పాటించాలని జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం పెదబయలు మండలంలో సుడిగాలి పర్యటన చేసారు. గంపరాయి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ పనులను తనిఖీ చేసారు. భవనం పైకి ఎక్కి నాణ్యత పరిశీలించారు. ఎప్పటి లోగా భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తారని ఇంజనీరింగు అధికారులను ప్రశ్నించారు. మండలానికి 4 గురు ఇంజనీర్లను నియమించామని పనులు జాప్యం జరగడానికి వీలు లేదన్నారు. అనంతరం తురకలవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.62 లక్షల వ్యయంతో చేస్తున్న నాడు- నేడు పనులను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఇంజనీర్లను ఆదేశించారు. మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, వంటగది, పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. విద్యార్దులకు తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయాలను కల్పించాలని స్పష్టం చేసారు. గ్రానైట్ పనులను తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఎంతమంది విద్యార్ధులు వుంటున్నారని హెచ్.యం.ను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత ఆర్. అండ్. బి రోడ్డు నుంచి తొట్లగొంది గ్రామానికి నిర్మిస్తున్న బి.టి.రోడ్డును పరిశీలించారు. అరడకోట గ్రామంలో జరుగుతున్న భూ సర్వే తనిఖీ చేసారు. ముఖ్యమంత్రి పేదలకు భూములు పంపిణీ చేస్తారని మహిళలతో మాట్లాడుతూ చెప్పారు. గ్రామంలో రూ. 21.80 లక్షలతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, రూ.14.95 లక్షలతో నిర్మిస్తున్న వై.యస్.ఆర్.హెల్త్ క్లినిక్, రూ.40 లక్షలతో నిర్మిసున్న సచివాలయ భవన నిర్మాణ పనులు పరిశీలించారు. అడుగులపుట్టు గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసారు. పెదబయలు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం తనఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ పై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్.డి.సి. నిధుల పై ఆరా తీశారు. ఓపిని, మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత చిప్పాపుట్టు బి.టి. రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రొజెక్ట్ అధికారి డా. వెంకటేశ్వర్, ఎస్.ఎస్.ఏ. ప్రొజెక్ట్ అధికారి మల్లిఖార్జున రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. సుధాకర్ రెడ్డి, పి.ఆర్. ఈ.ఈ. కుసుమభాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఈ.ఈ. కుమార్, డి.ఈ. అనుదీప్, పి. ఆర్. డి.ఈ. కొండయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు. జారీ సహాయ ప్రొజెక్ట్ అధికారి (ప్రచారం) పాడేరు.



## రైతులకు మేలు చేసేందుకే నగదు బదిలీ పథకం

**ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి**



తాడేపల్లి : నగదు బదిలీ పథకం వల్ల రైతులకు ఎలాంటి నష్టం జరగదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. సంస్కరణల్లో భాగంగా రైతులకు నగదు బదిలీ చేస్తున్నారని, రైతులకు మేలు చేసేందుకే నగదు బదిలీ పథకమని స్పష్టం చేశారు. అయితే ఉచిత విద్యుత్ సరఫరాపై టీడీపీ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తుందని మండిపడ్డారు. అప్పు కోసమని, ఉచిత విద్యుత్ ఎత్తివేయడానికే నగదు బదిలీ పథకమని తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ అంటే కరెంట్ తీగల మీద చంద్రబాబు బట్టలు ఆరేసుకోవాలన్నారని ఎద్దేవా చేశారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబు నాయుడు..వి ద్యుత్ చార్జీలు తగ్గించమని అడిగితే చంద్రబాబు కాల్పులు జరిపించారని గుర్తు చేశారు. నగదు బదిలీ పథకం వల్ల రైతులకు ఎలాంటి నష్టం జరగదని సజ్జల రామకృష్ణ పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ అనేది దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రకటించిన పథకమని, 1100 కోట్లు కరెంట్ బకాయిలను ప్రమాణ స్వీకారం రోజే వైఎస్సార్ రద్దు చేశారని ప్రస్తావించారు. ఉచిత విద్యుత్ పేటెంట్ రాజశేఖర్ రెడ్డిదని, నేడు తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. 5 ఏళ్ళు పాటు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి సీఎంప్లాన్ చేస్తున్నారని తెలిపారు.ఉచిత విద్యుత్ కోసం 10 వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని, 9 గంటల నాణ్యమైన విద్యుత్ కోసం ఫీడర్లకు 1700 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 'ప్రజలు ఖాతాల్లో నగదు జమ చేయడం వలన జవాబుదారీతనం పెరుగుతుంది. రైతుల ఖాతాల్లో వేసిన డబ్బు వేరే వాటికి బ్యాంక్‌లు జమ చేసుకోవడానికి వీల్లేదు. ఒక వేళ డబ్బు రైతుల ఖాతాల్లో వేయడం అలస్యమైనప్పటికీ ఉచిత విద్యుత్ ఆపరు. రైతులకు ఎస్క్రో అకౌంట్స్ ఇస్తున్నాం. విద్యుత్ మీటర్లు బిగించడం వలన రైతులు ఎంత విద్యుత్ ఉపయోగించుకుంటున్నారో తెలుస్తుంది. తల తోక లేకుండా ప్రతిపక్ష పార్టీలు ఉచిత విద్యుత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. డిస్కములకు చంద్రబాబు వేల కోట్ల బకాయిలు పెట్టారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర అప్పును 3 లక్షల 60 వేల కోట్లకు పెంచారు.

ఎఫ్ఆర్‌బీఎమ్‌కు నిబంధనలకు అనుగుణంగా అప్పు చేస్తున్నాము. అప్పు దేనికి తెచ్చామో కూడా మేము లెక్కలు చెప్పాగలుగుతాము. టీడీపీ తెచ్చిన అప్పు మీద లెక్కలు చెప్పగలరా.. ఎన్నికల్లో ఓట్లు కోసం వైఎస్ జగన్ పథకాలు ప్రవేశ పెట్టలేదు. ప్రజలకు మేలు జరగాలనే ఉద్దేశ్యంతో పథకాలు ప్రవేశ పెడుతున్నారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో, విజయవాడలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రజలు చనిపోతే చంద్రబాబు రాలేదు. అవినీతి, మర్డర్ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన వారిని పరామర్శించేందుకు చంద్రబాబు వచ్చారు. ప్రజలు చంద్రబాబు చేసే పనులను గుర్తు పెట్టుకుంటారు.' అని సజ్జల మండిపడ్డారు.

## డాక్టర్ రూప కు గీతం పిహెచ్‌డి అవార్డు



సాగర్‌నగర్ : వర్షాకాలంలో పట్టణ ప్రాంతాలను ముంచేత్తే వరదలు వాటిని సమర్ధంగా నివారించే మార్గాలపై అద్యయనం చేసినందుకు గాను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని డి.రూపకు గీతం పిహెచ్‌డి అవార్డును ప్రకటించింది. విభాగం సినియర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర పర్యవేక్షణలో బెంగళూరు నగరంలోని వృషభావతి ఆయకట్టు సమీపంలో వరద తీవ్రతలపై డాక్టర్ రూప అద్యాయనం చేశారు.

ఉప గ్రహ చాయా చిత్రాలు, డ్రోన్ కెమెరాల సహాయంతో జిఐఎస్ ఆధారంగా వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను, కారణాలను విశ్లేషించినట్లు అమె తెలిపారు. వర్షాకాలంలో పట్టణ ప్రాంతాలను వరదలు ముంచెత్తకుండా నీటిని 40శాతం వరకు భుగర్భజలాల రీచార్జింగ్‌కు మళ్లించవచ్చునని సూచించారు.

## జనవరి 1 నుంచి జరిగే సమగ్ర భూసర్వే పై వీడియో కాన్ఫరెన్స్



అమరావతి : రాష్ట్రంలో జనవరి 1 నుంచి జరగనున్న సమగ్ర భూ సర్వే కి సంబంధించి సన్నద్ధత, శిక్షణ తదితర అంశాలపై 13 జిల్లాల జాయింట్ కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్. హాజరైన సిసిఎల్ఎ, రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులు.

## శిరోముండనం కేసులో నూతన్‌నాయుడు అరెస్ట్



విశాఖపట్నం: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పెందుర్తి శిరోముండనం కేసులో సినీ నిర్మాత నూతన్‌నాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటకలోని ఉడిపిలో నూతన్‌నాయుడిని అరెస్ట్ చేసినట్లు విశాఖ సీపీ మనీష్ కుమార్ సిన్హా వెల్లడించారు. అతడిని స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. శ్రీకాంత్ అనే దళిత యువకుడికి శిరోముండనం చేసిన ఘటనలో ఇప్పటికే నూతన్‌నాయుడు భార్య మధుప్రియ, ఇంటి సహాయకురాలు వరహాలు, ఇందిర, ఝాన్సీ, సౌజన్య, బాలు, రవిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. తాజాగా నూతన్ నాయుడిని అరెస్ట్ చేసినట్లు సీపీ చెప్పారు. ప్రస్తుతం అతడు కర్ణాటక పోలీసుల అదుపులో ఉన్నాడని..త్వరలో విశాఖ తీసుకొస్తామన్నారు. నూతన్‌నాయుడు నుంచి 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

**పీవీ రమేశ్ పేరుతో ఫేక్ కాల్స్..**

మాజీ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ పేరుతో నూతన్ నాయుడు ఫేక్ కాల్స్ చేశారని సీపీ మనీష్ కుమార్ సిన్హా తెలిపారు. పీవీ రమేశ్ పేరుతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.సుధాకర్‌కు నూతన్ నాయుడు ఫోన్ చేసినట్లు గుర్తించామన్నారు. మీరు పేరుతో తనకు ఫోన్ వచ్చిందని డా.సుధాకర్.. పీవీ రమేశ్‌కు చెప్పారన్నారు. విషయం తెలిసిన వెంటనే పీవీ రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారని.. తన ఫోన్ నంబర్‌ను మరో వ్యక్తి వినియోగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారని సీపీ వివరించారు. తన పేరుతో ఫోన్లు చేస్తున్న వ్యక్తి ఎవరో కనుక్కోవాలని ఆయన కోరారని చెప్పారు. దీనిపై దర్యాప్తు చేయగా ఫేక్ కాల్స్ చేస్తోంది నూతన్ నాయుడని తేలిందన్నారు. ఆ నంబర్‌తో 30 మంది అధికారులకు ఫోన్ చేసినట్లు గుర్తించామని తెలిపారు. సిమ్‌ను ధ్వంసం చేయాలని నూతన్‌నాయుడు చూశారని.. దర్యాప్తులో మిగిలిన విషయాలు వెల్లడవుతాయని సీపీ చెప్పారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com